




# విజయభాను

45 వ వార్షికోత్సవం విజయభాను

విశాఖపట్నం, శుక్రవారం 08-07-2022 | VIJAYABHANU DAILY * VISAKHAPATNAM | సంపుటి : 45 సంచిక : 249 పేజీలు : 08 వెల : 1 రూపాయి


# మా పరిపాలనే గీటు రాయిగా ప్లీనరీ

- ప్లీనరీకి ప్రజల నుంచి అద్భుతమైన స్పందన కనిపిస్తోంది
- ఆహ్వానాలు అందని వారికి కూడా ఇదే నా ఆహ్వానం
- ప్లీనరీ విజయం చూశాక బాబు మళ్ళీ భోరున ఏడుస్తాడు
- ఒక్క స్కూలు కూడా మూతపడకపోయినా, చంద్రబాబు పదే పదే అబద్ధాలు
- ఇంటికో ఉద్యోగం, లేకపోతే నిరుద్యోగ భృతి ఇస్తానన్న బాబు మాట తప్పాడు
- 14 ఏళ్ళు సీఎంగా ఉండి బాబు చేయలేని జిల్లాల పునర్విభజనను సీఎం జగన్ చేశారు
- మూడేళ్ళలో రూ. 1.6 లక్షల కోట్లు డీబీటీ ద్వారా ప్రజలకు ఇచ్చాం
- సంక్షేమం - అభివృద్ధిలో ఏపీ దేశంలోనే ముందుంది - 2లక్షల శాశ్వత ఉద్యోగాలు ఇచ్చాం.





తాడేపల్లి (విజయభాను న్యూస్): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ఈ ప్లీనరీని అత్యంత ప్రతిష్టాత్మకంగా జరుపుకుంటున్నామని పార్టీ ప్రధాన కార్యదర్శి, ఎంపీ విజయసాయిరెడ్డి అన్నారు. ఈ మేరకు ఆయన పార్టీ కేంద్ర కార్యాలయంలో మాట్లాడుతూ సీఎం జగన్ మోహన్ రెడ్డి పరిపాలనకు గీటురాయిగా ప్లీనరీ జరుగుతుంది. మేం చేసిన మంచి పనులన్నీ ప్లీనరీలో చెబుతాం. విద్యా, వైద్య రంగం, వ్యవసాయం, సామాజిక న్యాయం, మహిళా సాధికారితపై ప్లీనరీలో చర్చిస్తాం. వక్తలందరూ మాట్లాడతారు. తీర్మానాలు ఆమోదిస్తాం. మా ప్లీనరీ సమావేశాలపైన కూడా ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయి. డ్వాక్రా మహిళలను బలవంతంగా తీసుకు వస్తున్నట్లుగా టీడీపీ నేతలు

తరువాయి 2లో..



వై.ఎస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర స్థాయి ప్లీనరీ సమావేశం ఏర్పాట్లును పర్యవేక్షిస్తున్న టీటీడీ చైర్మన్, ఉమ్మడి విశాఖపట్నం జిల్లా ఇంచార్జి వై.వీ సుబ్బా రెడ్డి, విశాఖ యం.పి ఎంవీవీ సత్యనారాయణ, విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు అవంతి శ్రీనివాస రావు, గన్నమని వెంకటేశ్వర రావు (జీవీ).

# రైతులకు అండగా ఉంటాం

## ప్రకృతి వ్యవసాయమే మేలు.

### ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



వైఎస్సార్ : ప్రకృతి వ్యవసాయమే ఈరోజుల్లో శ్రేయస్కరమని.. ఇందుకోసం ఏపీ ప్రభుత్వం అన్ని విధాల రైతులకు ప్రోత్సాహం అందిస్తుందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. వైఎస్సార్ జిల్లా పర్యటనలో భాగంగా.. గురువారం మధ్యాహ్నం పులివెందులలో ఏపీకార్ల్ వద్ద న్యూటెక్ బయోసైన్సెస్‌కు శంకుస్థాపన చేసి ఆయన ప్రసంగించారు. 'రసాయనాలతో కూడిన ఆహారం వల్ల ఎన్నో రకాల క్యాన్సర్లు వస్తున్నాయి. ఆహార ఉత్పత్తుల్లో రసాయనాలను తగ్గించాలి. ప్రకృతి వ్యవసాయమే ఈ రోజుల్లో అన్నివిధాలా శ్రేయస్కరం. ఏపీలో ఆరు లక్షల మంది రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు గ్రామాలపై మరింత దృష్టిసారించాలి. గ్రామస్థాయి నుంచి శిక్షణ అవసరం. ప్రకృతి వ్యవసాయంపై రైతుల్లో అవగాహన పెంచాలి. ఆర్బీకేల ద్వారా అవసరమైన శిక్షణ అందిస్తున్నాం.

ప్రకృతి వ్యవసాయంపై అంతర్జాతీయ సంస్థలతో మన ప్రభుత్వం ఒప్పందాలు కుదుర్చుకుంటోంది. రైతుల పెట్టుబడి వ్యయాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం తరపున పలు చర్యలు చేపడుతున్నాం. విత్తు నుంచి విక్రయం వరకూ ఆర్బీకేలు అండగా నిలుస్తున్నాయి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను అభివృద్ధి చేసేందుకు పథకాలు అమలు చేస్తున్నాం'' అని సీఎం జగన్ తెలియజేశారు.

## భూముల రీసర్వే ప్రక్రియ

# వేగవంతం చేయాలి

### - భూపరిపాలన శాఖ కమిషనర్ జి.సాయి ప్రసాద్



విశాఖపట్నం, (విజయభాను న్యూస్): జగనన్న శాశ్వత భూహక్కు, మరియు భూ రక్ష (రి సర్వే) పథకాన్ని వేగవంతం చేయాలని, వచ్చే నెలలో నోటిఫికేషన్ విడుదల చేసి, సెప్టెంబర్ నాటికి కార్యావర్తనం సిద్ధం చేసుకోవాలన్నారు. అక్టోబర్ మాసంలో భూపట్టాలు పంపిణీకి సిద్ధం చేయాలని భూపరిపాలన చీఫ్ కమీషనర్ మరియు ప్రత్యేక ముఖ్యకార్యదర్శి జి.సాయిప్రసాద్ కలెక్టర్లను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టర్లు, సంయుక్త కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాల్లోని భూముల రీసర్వే ప్రక్రియలో క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సాంకేతిక సమస్యల పరిష్కారానికి ఇప్పటికే గడువు ఇచ్చామని, కావున ఆ పనులు పూర్తి కావాలన్నారు. సర్వేలో ఎలాంటి

తరువాయి 2లో..

## సినీనటి సాయిపల్లవి పిటిషన్‌ను కొట్టివేసిన తెలంగాణ హైకోర్టు



హైదరాబాద్: సినీనటి సాయి పల్లవి దాఖలు చేసిన పిటిషన్‌ను తెలంగాణ హైకోర్టు కొట్టి వేసింది. కశ్మీర్ ఫైల్స్ సినిమాతో పాటు గోరక్షకులపై సాయిపల్లవి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారని హైదరాబాద్ సుల్తాన్‌బజార్ పోలీసులకు భజరంగ్‌దళ్ నాయకులు ఇటీవల ఫిర్యాదు చేశారు. భజరంగ్‌దళ్ నాయకుల ఫిర్యాదుపై న్యాయసలహా తీసుకొని కేసు నమోదు చేసిన పోలీసులు సాయిపల్లవికి గత నెల 21న నోటీసులు జారీ చేశారు. దీంతో

తరువాయి 6లో..






# హోటల్ లో ప్లాస్టిక్ వినియోగం పై జివిఎంసి కమిషనర్ సీరియస్




విశాఖపట్నం, (విజయభాను న్యూస్): నగరంలో ప్లాస్టిక్ నిషేధం అమలపై ప్రస్తుత జివిఎంసి కమిషనర్ లక్ష్మీ శ తీవ్రంగా ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికే జీవీఎంసీ పరిధిలో జోనల్ స్థాయి అధికారులను అప్రమత్తం చేస్తూ సచివాలయ సిబ్బంది సమన్వయపరుస్తూ తనదైన శైలిలో ప్లాస్టిక్ వినియోగం పై పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టారు. ఇదిలా ఉండగా జీవీఎంసీ 51 వ వార్డు పరిధి కళింగ నగర్ ప్రాంతంలో గిరి ప్రదక్షణ కు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించేందుకు వెళ్లిన జీవీఎంసీ కమిషనర్ లక్ష్మి శ సమీపంలో ఉన్న న్యూ రామ సాయి పార్లర్ అండ్ రెస్టారెంట్.హెూటల్ లో ప్లాస్టిక్ సంచుల వినియోగాన్ని ఆయన గుర్తించారు. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన కమిషనర్ హెూటల్ నిర్వాహకుని ప్రశ్నించారు. ప్లాస్టిక్ నిషేదం పై వివరించారు. హెూటల్ యాజమాన్యం బహిరంగంగా ప్లాస్టిక్ కవర్లను వాడటం పట్ల సచివాలయ సిబ్బందిని పిలిచి ఆరా తీశారు. సిబ్బంది పర్యక్షణ లేకపోవడం వల్లనే ఇంటువంటి ఘటనలు పునరావృతం అవుతున్నాయని వారి పై ఆగ్రహం వ్యక్తం చేశారు. దింతో హెూటల్ సీజ్ చేయాలని జీవీఎంసీ జోన్ -5 కమిషనర్ మల్లయ్య నాయుడు ని ఆదేశించిన కమిషనర్ హెూటల్ నిర్వహకునికి రెండు వేల

తరువాయి 6లో..

# ప్రభుత్వ పథకాలు ప్రజలలోనికి తీసుకువెళ్ళవలసిన బాధ్యత కార్యదర్శులదే

**- జివిఎంసి కమిషనర్ డాక్టర్ జి.లక్ష్మీశ**




విశాఖపట్నం (విజయభాను న్యూస్) : ప్రభుత్వ పథకాలు ప్రజలలోనికి తీసుకువెళ్లవలసిన బాధ్యతా సచివాలయ కార్యదర్శులదే అని జివిఎంసి కమిషనర్ డాక్టర్ జి. లక్ష్మీశ పేర్కొన్నారు. గురువారం ఆయన క్షేత్రస్థాయి పర్యటన సందర్భంగా 2వ జోన్ 9వ వార్డు పరిధిలోని విశాలాక్షి నగర్ కార్పొరేటర్ కోరుకొండ స్వాతి దాస్ తో కలసి పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎంతో ప్రతిష్టాత్మకంగా నెలకొల్పిన సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ పదకాలని సచివాలయ కార్యదర్శులు, వాలంటీర్ల ద్వారా ప్రజలకు అందేలా చూడాలని, ప్రభుత్వ పదకాలని ప్రతి కార్యదర్శికి క్షుణ్ణంగా తెలిసి వుండాలని, ప్రతి కార్యదర్శి బాధ్యతగా ప్రజలకు స్వచ్ఛందంగా సేవలు అందించేందుకు నిరంతరం కృషి చేయాలని ఆదేశించారు. "క్లాప్" (క్లీన్ ఆంధ్రప్రదేశ్) పథకంలో భాగంగా చెత్త తరలించే వాహనాలు నిర్ణీత సమయానికే నిర్దేశించిన ప్రాంతాలలో ఉండేలా చూడాలని కార్యదర్శులను ఆదేశించారు. క్లాప్ పథకంలో భాగంగా సేవా రుసుం పై ప్రజలకు తెలియ పరచాలని, చెత్త పన్నుకాదని, సేవా రుసుం అని తెల్లియపరచాలని ఆదేశించారు. వార్డులో ఎన్నో సమస్యలు ఏరియాలో వున్నాయని, ఏ ఏ ప్రాంతాలలో రూ. 60/-, రూ.120/- లు వసూలు చేస్తున్నారు. ప్రతి నెల ఎంత కలక్షన్ అవుతుంది, సేవ రుసుం కట్టిన వారికి ఆన్‌లైన్ రసీదు ఇస్తున్నారా అని ఆరా తీశారు. వార్డులో ప్లాస్టిక్ నిర్మూలనకు కార్యదర్శులు ప్రత్యేక బాధ్యత తీసుకొని దుకాణ దారులు, టిఫిన్ సెంటర్ ప్లాస్టిక్ బ్యాగులు అమ్మడంగాని, వినియోగదారులు అందించడం గాని చేయకుండా నిత్యం నిఘా వుంచి పర్యవేక్షించాలని, ఎవరైనా నిషేధిత ప్లాస్టిక్ ను కలిగివుంటే వారి నుండి అపరాధ రుసుం వసూలు చేయాలని ఆదేశించారు. వారాంతపు సంతలలోను, అక్కడక్కడ ప్లాస్టిక్ వినియోగం జరుగుతుందని స్థానిక కార్పొరేటర్ కమిషనర్ కు తెలపగా ప్రత్యేక నిఘా ఉంచాలని జోనల్ కమిషనర్ రామును ఆదేశించారు. వార్డులో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని, మలేరియా, డెంగ్యూ వ్యాధుల బారి నుండి ప్రదకుండా దోమల మందులు, ఫాగింగ్ ఎప్పటికప్పుడు పిచికారీ చేయాలని మలేరియా సిబ్బందిని ఆదేశించారు. ప్రతి శుక్రవారం "డ్రై డే" పాటించే విధంగా ప్రజలలో అవగాహన కల్పించాలని సచివాలయ కార్యదర్శులను ఆదేశించారు. కార్పొరేటర్ స్థానిక సమస్యలను కమిషనర్ కు వివరించగా, పరిష్కరిస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో జివిఎంసి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ కెఎస్ఎల్జి శాస్త్రి, జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము, ఎఎంఒహెచ్ డాక్టర్ కిషోర్, కార్యనిర్వాహక ఇంజనీర్ మత్స్య రాజు, పట్టణ ప్రణాళిక అధికారులు, మలేరియా సిబ్బంది, శానిటరీ సూపర్వైజర్, శానిటరీ ఇన్స్పెక్టర్, వార్డు సచివాలయ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.




## అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి లక్ష్యంగా
# ముఖ్యమంత్రి జగన్ పాలన సాగిస్తున్నారు

**- ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ - 27వ వార్డ్ కార్పొరేటర్ గొలగాని వీరారావు**



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్ పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్, 27వ వార్డ్ కార్పొరేటర్ గొలగాని వీరారావు పేర్కొన్నారు. వార్డులోని దొండపర్తి రామాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో ఇళ్ళ పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇళ్లు లేని పేదలందరికీ పక్కా వసతి సదుపాయం కల్పిం చడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు.

27వ వార్డు వైసిపి అధ్యక్షుడు నీలాపు సర్వేశ్వర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో 1,275 మందికి ఇళ్ల పట్టాలను అందజేశారు. అనంతరం దివంగత నేత వైయస్ రాజశేఖర్ రెడ్డి 73వ జయంతి సందర్భంగా పార్టీ నేతలు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పద్మ నాభం అమ్మాజీ, ఎన్ అనిల్ కుమార్, కె మధు,పి.అజయ్ రెడ్డి, అశోక్, శివారెడ్డి పాల్గొన్నారు.

# మూడవ జోన్ లో బహిరంగ వేలం ప్రకటన

విశాఖపట్నం, (విజయభాను న్యూస్) : మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ జోన్- 3(ఆశీల్ మెట్ట) పరిధిలోని ఖాళీగా ఉన్న దుకాణాలకు, దొండపర్తి కళ్యాణమండపంనకు తేది.14-07-2022న ఉదయం 11.00గంటలకు జోన్-3 కార్యాలయం వద్ద బహిరంగ వేలం నిర్వహించబడుతుందని జోనల్ కమిషనర్ శివ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలియజేశారు. కావున, వేలంపాటలో పాల్గొనదలచిన సంస్థలు, వ్యక్తులు వేలంపాటలో పాల్గొనవలసినదిగా తెలియజేయడమైనది. ధరావత్తు సొమ్ము, రిజిస్ట్రేషన్ ఫీజు, ఇతర నియమ నిబంధనల్ కొరకు లీజు నోటిఫికేషన్ పత్రిని రూ.200/- లు చెల్లించి మూడవ జోనల్ కార్యాలయంలో పొందవచ్చును. ఇతర వివరాలకు జోన్-3 కార్యాలయం పనివేళలలో పర్యవేక్షకుని సంప్రదించగలరని తెలియజేయడమైనది.

## భూముల రీసర్వే ప్రక్రియ
# వేగవంతం చేయాలి

ఆటంకాలు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

ఈ వీడియో సమావేశంలో కలెక్టర్ డా.ఏ.మల్లిఖార్జున, సంయుక్త కలెక్టర్ కే ఎస్ విశ్వనాథన్, భూసర్వే మరియు ల్యాండ్ రికార్డ్స్ సహాయ సంచాలకులు అర్. విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# జ్ఞాన సంపదతోనే దేశాభివృద్ధి సాధ్యం

**- మౌంట్‌ఆబూలో జాతీయ మీడియా సదస్సు - ఆగస్టు 29 నుంచి సెప్టెంబర్ 2 వరకూ నిర్వాహణ**



విశాఖపట్నం (విజయ భాను న్యూస్): ఆధ్యాత్మిక శక్తిని పెంపొందించుకొని, కర్తవ్య నిర్వ హణలో సమర్థతను, శక్తిని, ఉత్సాహన్ని పొందేందుకు జాతీయ మీడియా సదస్సు-2022 నిర్వ హించడం జరుగుతుందని ప్రజా పిత బ్రహ్మ కుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యా లయం పేర్కొంది. సంస్థ ప్రతినిధి బి.కె.రామేశ్వరి (రమ) ఆధ్వ ర్యంలో గురువారం ఇక్కడి డాబాగార్డెన్స్ ప్రెస్ క్లబ్‌లో మీడియా సదస్సుకు సంబంధించిన వివరాలను పలువురు అతిధుల ద్వారా వెల్లడించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యూకేషన్ అప్పిలేట్ ఆథారిటీ చైర్మన్ ఆచార్య జిఎస్ఎన్ రాజు. గౌరవ అతిధిగా జీవీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ యాదగిరి శ్రీనివాసరావులు మాట్లాడుతూ నిరంతరం సమాజానికి దిక్సూచిగా వ్యవహరించే జర్నలిస్టులకు ఏటా జాతీయ మీడియా సదస్సు ఏర్పాటు చేసి వారికి అవసరమైన జ్ఞాన సంపదను పంచిపెట్టడం అభినందనీయమన్నారు. మీడియాతోనే ప్రపంచ వ్యాప్తంగా అనేక ప్రజా సమస్యల పరిష్కారానికి అవ కాశం కలుగుతుందన్నారు. క్రమం తప్పకుండా ఈ జాతీయ సదస్సు ఏర్పాటు చేయడం, అందులో దేశ వ్యాప్తంగా అనేక రాష్ట్రాల జర్నలిస్టులను భాగస్వాము లను చేయడం ఒక్క బ్రహ్మకుమారీలకే సాధ్యపడిందన్నారు. కార్యక్రమంలో అప్పన్న ధర్మకర్తల మండలి సభ్యులు, వైజాగ్ జర్నలిస్టుల ఫోరం అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ గత 12 ఏళ్లుగా జాతీయ మీడియా సదస్సుకు విశాఖ నుంచి పలువురు జర్నలిస్టులు హాజరు కావడం జరుగుతుందన్నారు. ఈ ఏడాది కూడా మౌంట్ ఆబూలో జరిగే మీడియా సదస్సుకు హాజరయ్యే జర్నలిస్టులు తమ అక్రిడేషన్, గుర్తింపుకార్డు, ఆధార్‌కార్డు, జెరాక్స్, పాస్‌పోర్టు సైజ్ ఫోటోను డాబాగార్డెన్స్ ప్రెస్‌క్లబ్(వైజాగ్ జర్నలిస్టుల ఫోరం) కార్యాలయం పనివేళల్లో ఈనెల 15వ తేదిలోగా సమర్పించి, తమ పేర్లును నమోదు చేసుకోవాలని కోరారు.

**- ఆగస్టు 29 నుంచి సెప్టెంబర్ 2 వరకూ సదస్సు**

ఈ ఏడాది జాతీయ మీడియా సదస్సును ఆగస్టు 29 నుంచి సెప్టెంబర్ 2 వరకూ మౌంట్‌ఆబూ శాంతివనంలో నిర్వహించడం జరుగుతుందని బ్రహ్మకుమారీస్ ప్రతినిధి బి.కె.రామేశ్వరి తెలిపారు. తొలిరోజు సాయంత్రం సదస్సు ప్రారంభమవుతుందని చెప్పారు. ఈ సమావేశాలు ముగిసిన అనంతరం సర్టిఫికేట్లు అందజేసి మౌంట్ ఆబూ దర్శనం కల్పించడం జరుగుతుందన్నారు. ఈ సదస్సుతో జర్నలిస్టులకు తమ జీవితంలో అన్ని విధాలా ముందుకు సాగేందుకు చక్కని విలువలతో కూడిన జీవితం గడిపేందుకు ఉపకరిస్తుందన్నారు. కావున జర్నలిస్టులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రామేశ్వరి కోరారు. ఈ సందర్భంగా ఆమె అతిధులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో విజెఎఫ్ ఉపాధ్యక్షుడు ఆర్.నాగరాజు పట్నాయక్ స్వాగతం పలకగా, కార్యవర్గ సభ్యులు ఎంఎస్ ఆర్ ప్రసాద్, ఇరోతి ఈశ్వరరావు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

# మా పరిపాలనే గీటు రాయిగా ప్లీనరీ

తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు. ఇందులో ఎటువంటి వాస్తవం లేదు. ప్లీనరీ సమావేశాలకు పార్టీ కార్యకర్తలు, ప్రతినిధులు, నామినేటెడ్ పదవులు పొందినవారు మాత్రమే హాజరు అవుతారు. ప్రభుత్వ ఉద్యోగులు కానీ, మిగతావారు ఎవరికీ మేము ఆహ్వానం పంపించలేదు.

**ప్లీనరీకి ఇదే ఆహ్వానం..**

పార్టీ ఆవిర్భవించిన తర్వాత జరుగుతున్న మూడో ప్లీనరీ ఇది. గత రెండు ప్లీనరీలు ప్రతిపక్షంలో ఉండగా జరిగితే.. ఈసారి అధికార పక్షంగా మూడేళ్ళ పాలన తర్వాత జరుగుతున్న ప్లీనరీ ఇది. ప్రతిపక్షంలో ఉండగా, ఎంతో నిర్మాణాత్మకంగా విమర్శలు చేశాము. మూడేళ్ళు అధికార పక్షంగా అంతకు మించి నిర్మాణాత్మకంగా ముఖ్యమంత్రి జగన్ పరిపాలన అందించగలిగారు. కాబట్టి, అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో ఈ ప్లీనరీ జరగబోతుంది. ప్లీనరీకి ఒక క్రమపద్ధతిలో ఆహ్వానాలు పంపడం జరిగింది. ఆహ్వానాలు అందనివారు కూడా పార్టీ వ్యవస్థలో సభ్యులుగా ఉన్న ప్రతి ఒక్కరూ, ఈ మీడియా వేదికగా నా ఆహ్వానాన్నే, ప్లీనరీకి ప్రత్యక్ష ఆహ్వానంగా భావించి హాజరు కావాలని కోరుతున్నానన్నారు. ఎవరికైనా ఆహ్వానాలు అందకపోతే, మా పొరపాటును మన్నించి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్లీనరీ సమావేశాలకు క్షేత్రస్థాయి నుంచి పైస్థాయి వరకూ ప్రతి ఒక్కరు కూడా హాజరు కావాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం. పార్టీ కార్యకర్తల్లో, ప్రజల్లో స్పందన చూస్తే, ప్లీనరీ విజయవంతం అవుతుందని చాలా స్పష్టంగా కనిపిస్తోంది. మాకున్న అంచనాల ప్రకారం జులై 8వ తేదీ మొదటిరోజు సుమారు లక్షా 50వేలమంది వస్తున్నారు. రెండోరోజు 4 లక్షలమంది హాజరు అవుతారని మా అంచనా. మా అంచనాలు తారుమారు కావని భావిస్తున్నాం. రేపటి కార్యకర్తల సభకు అన్ని జిల్లాల నుంచీ, అన్ని నియోజకవర్గాల నుంచీ, అన్ని గ్రామాల నుంచీ కార్యకర్తలంతా తరలివస్తారు. ఏ అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశాం. ప్లీనరీ విజయం స్పష్టంగా కనిపిస్తున్నందువల్ల చంద్రబాబులో ఫ్రస్టేషన్ పరాకాష్టకు చేరింది. 14ఏళ్లు అధికారంలో ఉన్నన్నాళ్ళు, ప్రజలకు ఏమీ చేయని చంద్రబాబు, ఇప్పుడు తాను చేసిన కార్యక్రమాలు ఇవీ.. అని చెప్పకుండా తెల్లారిలేస్తే, విమర్శల మీదే బతుకుతున్నాడు. మా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను నిలుపుదల చేయాలనే దురుద్దేశ్యంతో, చంద్రబాబు కుటిల ప్రయత్నాలు చేస్తున్నారనే విషయం అందరికీ తెలుసు. చంద్రబాబు ఎంత నిర్లక్ష్యంగా విమర్శలు చేస్తున్నారనే దానికి ఉదాహరణ- 8 వేల గ్రామాల్లో స్కూళ్ళను మూసేశారని పచ్చి అబద్ధాన్ని నిన్న చెప్పాడు. నిజానికి ఒక్క స్కూల్ కూడా మూసి వేయలేదు. మరోవైపు జగన్ మోహన్ రెడ్డిగారు ముఖ్యమంత్రి అయ్యాక, నాడు-నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ ఆసుపత్రులను అభివృద్ధి చేస్తున్నారు. వ్యవసాయం, సామాజిక న్యాయం, మహిళా సాధికారత అంశాలను తీసుకుంటే దేశంలోనే అన్ని రాష్ట్రాల కన్నా ఆంధ్రప్రదేశ్ ముందంజలో ఉంది. మిగతా రాష్ట్రాల నుంచి వస్తున్న ఫీడ్ బ్యాక్ కూడా అదే. ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడుకు మాత్రం ఇది డిఫరెంట్‌గా కనిపిస్తోంది.

**ఇంటికో ఉద్యోగం హామీ ఎందుకు అమలు చేయలేదు బాబూ..?**

అధికారంలోకి వచ్చిన వెంటనే, 2 లక్షలమందికి శాశ్వత ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చి, వాలంటీర్లతో కలుపుకుని మొత్తం నాలుగు లక్షలమందిని సచివాలయ వ్యవస్థ ద్వారా నియమించుకోవడం, రైతులకు ప్రయోజనకరంగా ఉండేందుకు ఆర్బీకేలు ఏర్పాటు, ప్రతి గ్రామంలో వైద్యం అందించేందుకు విలేజ్ క్లినిక్ లు ఏర్పాటు చేయడం.. ఇలా ముఖ్యమంత్రి జగన్ గారు పరిపాలనను సంస్కరణల బాట పట్టించారు. . మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల వద్దకే ప్రభుత్వం అనే సిద్ధాంతంతో ముందుకు వెళుతోంది. భవిష్యత్‌లో కూడా ప్రజలకు మరింత మెరుగైన జీవన పరిస్థితులు కల్పించాలన్నది ముఖ్యమంత్రిగారి అభిమతం. అదే చంద్రబాబు నాయుడు గతంలో ప్రతి ఇంటికి ఉద్యోగం కల్పిస్తామని వాగ్దానం చేశారు. ఒకవేళ ఉద్యోగం కల్పించలేకపోతే నిరుద్యోగ భృతి ఇస్తామన్నారు. మరి ఆనాడు మీరిచ్చిన హామీ ఏమైందని, ఎందుకు మాట తప్పారని సూటిగా ప్రశ్నిస్తున్నాం. ప్రతిరోజు ఒక అబద్ధాన్ని తీసుకుని, దాన్నే నిజం అని పదే పదే ప్రజల మెదళ్ళలో విషం నింపే ప్రయత్నం చంద్రబాబు చేస్తున్నాడు. లిక్కర్ బ్రాండ్స్ విషయానికి వస్తే.. మా ప్రభుత్వ హయాంలో ఏ ఒక్క డిస్టలరీకి కొత్తగా అనుమతి ఇవ్వలేదు. గత ప్రభుత్వ హయాంలో 20 డిస్టలరీలకు ఎవరు అనుమతి ఇచ్చారో చంద్రబాబు నాయుడు సమాధానం చెప్పాలి. గతంలో ఎన్నడూ లేని 254 కొత్త లిక్కర్ బ్రాండ్లకు ఎవరు అనుమతి ఇచ్చారు అంటే అదికూడా చంద్రబాబే. మద్యంలో కెమికల్స్ ఉన్నాయని చంద్రబాబు పచ్చి అబద్ధాలు ఆడుతున్నాడు. ఇంతకీ, బాబు, లోకేష్ ... ఏ బ్రాండు తాగుతున్నారో ఈరోజే బయట పెట్టాలి.

- 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు జిల్లాల పునర్ వ్యవస్థీకరణ చేయలేకపోయారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిగారు మూడేళ్లలోనే చేసి చూపించారు. మదనపల్లె ఏ జిల్లాలో ఉండాలో అని ఈరోజు చంద్రబాబు విమర్శలు చేస్తున్నాడు. ముఖ్యమంత్రి జగన్ గారు రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు నిర్మాణాత్మక కార్యక్రమాలను రూపొందిస్తూ, సుపరిపాలన చేస్తుంటే.. ప్రతి కార్యక్రమాన్ని అడ్డుకుంటూ ప్రభుత్వంపైన, జగన్ గారిపైన చంద్రబాబు విమర్శలు చేస్తున్నాడు. వ్యవస్థలను అడ్డుపెట్టుకుని సంక్షేమ- అభివృద్ధి కార్యక్రమాలకు అడ్డుకోవడం సమంజసమా అని చంద్రబాబును ప్రశ్నిస్తున్నాం. ఈ మూడేళ్లలో దళారులు, మధ్యవర్తులు లేకుండా ప్రజలకు నేరుగా 1.6 లక్షల కోట్లు డీబీటీ ద్వారా నగదును అందించిన ఘనత జగన్‌గారికే దక్కుతుంది. ఇవన్నీ ప్రజలు గమనిస్తున్నారు.

**25 రకాల వంటకాలతో భోజనాలు...**

ప్లీనరీలో పెట్టే భోజనాల విషయంలో కూడా టీడీపీ, చంద్రబాబు అసంబద్ధ ఆరోపణలు చేస్తున్నారు. సమాజంలో వెజిటేరియన్స్, నాన్ వెజిటేరియన్స్ ఉంటారు. అందుకు తగ్గట్టుగానే మా ప్లీనరీ సమావేశాల్లో 25 రకాల వంటకాలతో భోజన ఏర్పాట్లు చేశాం. మేమేదో ప్లీనరీలో పంది మాంసం పెడుతున్నామని దుష్ప్రచారం చేస్తున్నారు. బహుశా చంద్రబాబుకు అది తిని తిని అలవాటు అయిందేమో...!. మా ప్లీనరీ మెనూలో అటువంటి ప్రస్తావనే లేదు. - ప్లీనరీ ఘన విజయాన్ని చూసిన తర్వాత 10వ తేదీన మరిన్ని ప్రెస్‌మీట్లు పెట్టి బహుశా చంద్రబాబు భోరుభోరున మరోసారి ఏడుస్తారనే విషయం అర్థం అవుతోంది. ప్లీనరీ సమావేశాలకు వచ్చే ప్రతి ఒక్కరికీ అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశాం. ప్లీనరీకి సంబంధించిన అన్ని కమిటీలు అద్భుతంగా పనిచేస్తున్నాయి. ఏర్పాట్లు అన్ని పూర్తయ్యాయి. ప్రతి ఒక్కరు ఈ ప్లీనరీకి హాజరు కావచ్చు. ఇక వాతావరణం చూస్తే... రేపు, ఎల్లుండి వర్షం వస్తుందని వాతావరణ శాఖ వెల్లడించింది. అయితే వర్షం రాకుంటే ప్లీనరీ అద్భుతంగా జరుగుతుంది. వర్షాలకు ఈ రెండు రోజులు మినహాయింపు ఇవ్వాల్సిందిగా ఆ భగవంతుడిని, వరుణ దేవుణ్ణి కోరుకుంటున్నాం.

**విలేకరుల ప్రశ్నలకు సమాధానమిస్తూ..**

- ప్లీనరీకి మా పార్టీ గౌరవ అధ్యక్షురాలు వైఎస్ విజయమ్మ గారు, అధ్యక్షులు వైఎస్ జగన్ మోహన్ రెడ్డిగారు హాజరు అవుతారు. మా పార్టీ ప్రజాప్రతినిధులంతా హాజరు అవుతారు. పార్టీ అధ్యక్షుడి ఎన్నికపై మొదటి రోజు తీర్మానం ప్రతిపాదిస్తాం. మరుసటి రోజు ఎన్నిక జరుగుతుంది.
- ఈ ప్రభుత్వం సంక్షేమానికి పెద్దపీట వేస్తుంది. బడుగు, బలహీన వర్గాలతో పాటు అగ్ర కులాల్లోని పేదలకు కూడా లబ్ధి చేకూరేలా సంక్షేమ పథకాలను రూపుకల్పన చేసి వాటిని అమలు చేస్తున్నాం.
- 2024 ఏప్రిల్‌లో ఎలాగూ ఎన్నికలు వెళ్లాల్సిందే. ముందస్తు ఎన్నికలకు తొందరెందుకు...?
- ముందస్తు ఎన్నికలు వస్తే ముఖ్యమంత్రిని అవుతానని చంద్రబాబు నాయుడు కలలు కంటున్నాడు. అది కలగానే మిగిలిపోతోంది.
- పార్టీని మరింత పటిష్టం చేసే కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రిగారు కమిటీల నియామకానికి సంబంధించి రేపు ప్రకటన చేయబోతున్నారు. దీంట్లో ప్రతి స్థాయిలో కూడా ఎలా నియామకాలు జరగాలనేది అధ్యక్షుల వారు ప్రకటన చేస్తారు. నిర్ణీత గడువు లోపల అన్ని కమిటీల నియామకాలు పూర్తి చేసుకుని, పార్టీని పటిష్టం చేసుకుని, రాబోయే ఎన్నికలకు సమాయత్తం అవుతాం.
- ఈ మీడియా సమావేశంలో డిప్యూటీ సీఎం శ్రీ కె. నారాయణ స్వామి, హోం మంత్రి శ్రీ తానేటి వనిత, మంత్రులు శ్రీ జోగి రమేష్, శ్రీ చెల్లుబోయిన వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# సెజ్ లో గల పరిశ్రమలలో దివ్యాంగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి



అచ్యుతాపురం (విజయ భాను న్యూస్) : వికలాంగుల హక్కుల చట్టం 2016 ప్రకారం సెజ్ లో గల పరిశ్రమలలో దివ్యాంగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని శ్రీ స్వామి వివేకానంద దివ్యాంగుల అసోసియేషన్ వ్యవస్థా పకులు మేరుగు నూకరాజు కోరారు. గురువారం ఏపిఐ ఐసి జోనల్ మేనేజర్ కె. సీతా రాంని కలిసి వికలాంగులకు చట్ట ప్రకారం 5 శాతం రిజర్వేషన్ ఆధారంగా సెజ్ లో గల పరిశ్రమలలో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మేరుగు నూకరాజు మాట్లాడుతూ యలమంచిలి నియోజక వర్గం పరిధిలో ఉన్న దివ్యాంగులకు వికలాంగుల హక్కుల చట్టం 2016 జి.ఓ ప్రకారం ప్రయివేట్ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు.

ఈ కార్యక్రమంలో ఓ సత్య శైలజ, మెరుగు సన్యాసిరావు, ఆర్ వెంకటేష్, వాడమోదుల తాతారావు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి కల్పనలో మహిళలకు పెద్దపీట

## దివీస్ సంస్థ పిఏజీఎం వై.ఎస్.కోటేశ్వరరావు



భీమునిపట్నం (విజయభాను న్యూస్) : భీమిలీ మండలం చిప్పాడ గ్రామంలో ఉన్న ధివీస్ యాజమాన్యం చుట్టు ప్రక్కల గ్రామాలలో ఉన్న మహిళలకు స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ వద్ద ఫుడ్ ప్రొసెసింగ్ కోర్సులో ప్రజ్వల వాణి సంస్థ ద్వారా శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా దివీస్ సంస్థ డైరెక్టర్ దివి మధుసూదనరావు మాట్లాడుతూ ఆసక్తి గల మహిళలకు వృత్తి విద్యా కోర్సులు అందించి వారికి స్వశక్తి తో ఉన్నత స్థితికి చేరుకోవడానికి దివీస్ సంస్థ ఎల్లప్పుడూ సహకారం అందిస్తుందవి తెలియజేసారు.దివీస్ సంస్థ పి ఏ జీ ఎం వై ఎస్ కోటేశ్వర రావు మాట్లాడుతూ ఉపాధి కల్పనలో మహిళలకి పెద్దపీట వేస్తూ వారు అభిరుచులకు అనుగుణంగా ఆదాయం అందించి. శిక్షణలను ఎంపిక చేసి శిక్షణ పూర్తి చేసుకున్న వారికి చేయూత నందిస్తూ దివిస్ పరిసర గ్రామ ప్రజలకు ఎల్లప్పుడూ సహకారం అందించుటకు దివిస్ యాజమాన్యం ఎల్లప్పుడూ కృషి చేస్తుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో సి ఎస్ ఆర్ మేనేజర్ డి సురేష్ కుమార్ మరియు ఫణి, శేఖర్, తది తరులు పాల్గొన్నారు.

# న్యూ హెూప్ ఫౌండేషన్ కార్యక్రమాలు భేష్

## జనసేన నాయకులు పంచకర్ల సందీప్



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : న్యూ హెూప్ ఫౌండేషన్ ద్వారా డాక్టర్ మంచ నాగమల్లేశ్వరి నిరంతరం సేవా కార్యక్రమాలు చేయడంతో పాటు చేనేత కార్మికులకు చేయూత నివ్వాలన్న ఆలోచన అభినందనీయమని జనసేన నాయకులు పంచకర్ల సందీప్ కొనియాడారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో మిస్ అండ్ మిసెస్ ఉత్తరాంధ్ర - 2022 ఫైనల్స్ విజయవంతమైన నేపథ్యంలో ద్వారకా నగర్ పబ్లిక్ లైబ్రరీలో సక్సెస్ మీట్ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సందీప్ మాట్లాడుతూ ఇటువంటి మంచి కార్యక్రమం నిర్వహించడం వల్ల మహిళల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు ఎంతో దోహదపడు తుందన్నారు. భవిష్యత్తులో మరిన్ని మంచి కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షిం చారు. ఫైనల్స్ విజేతలైన మిసెస్ ఉత్తరాంధ్ర - 2002 కొణతాల భాగ్యలక్ష్మి, మిస్ ఉత్తరాంధ్ర - 2022 గద్దె నిధి చౌదరి లను అభినందించారు. ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు నాగమల్లేశ్వరి మాట్లాడుతూ చేనేత కార్మికులకు తమ వంతు సహాయం అందించాలన్న సంకల్పంతో భారతీయ సంస్కృతి సంప్రదాయాలు ప్రతిబింబించేలా నిర్వహించిన మిస్ అండ్ మిసెస్ ఉత్తరాంధ్ర - 2022 పోటీలు విజయవంతమవడంలో ఎంతోమంది కృషి ఉందన్నారు. 45 రోజుల పాటు తమ ప్రయాణంలో సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.

ఈ సమావేశంలో మిస్ ఉత్తరాంధ్ర రన్నర్ సాహితీ బంగారు, బెస్ట్ మహిళ మిత్రో లక్ష్మి, బెస్ట్ ఐస్ రాయప్రోలు శ్రీపద్మ, 2019 మిసెస్ ఉత్తరాంధ్ర శైలజ తదితరులు పాల్గొన్నారు.

# విలీనం మాకొద్దు

## మా స్కూలే మాకు ముద్దు అంటున్న విద్యార్థులు




భీమునిపట్నం (విజయభాను న్యూస్) : : విలీనం మాకొద్దు మా స్కూలే మాకు ముద్దు అంటున్న విద్యార్థులు గురువారం భీమిలి నియోజకవర్గం పరిధి భీమిలి రూరల్ మండలం సింగనబంధ గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల లో 3,4,5 తరగతులను హైస్కూల్లో విలీనం చేయడాన్ని వ్యతిరేకిస్తూ విద్యార్థులు తల్లిదండ్రులతో నిరసన తెలియజేసారు. ఈ కార్యక్రమంలో భీమిలి నియోజకవర్గం ఇంచార్జ్ మరియు రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కోరాడ రాజబాబుతో పాటు విశాఖ పార్లమెంట్ రైతు ప్రధాన కార్యదర్శి మరియు భీమిలి రూరల్ మండలం అధ్యక్షులు డి ఏ ఎన్ రాజు ఎక్స్ జెడ్పిటిసి సరగడ అప్పారావు నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షులు పతివాడ రాంబాబు నియోజకవర్గ వాణిజ్య విభాగ ఉపాధ్యక్షులు యరబాల అనిల్ ప్రసాద్ రెండో డివిజన్ అధ్యక్షులు బడిగంటి నీలకంఠం నియోజకవర్గ రైతు ఉపాధ్యక్షులు కనకల సూరిబాబు రెండో డివిజన్ మహిళా అధ్యక్షురాలు కనక రత్నం ఎక్స్ సర్పంచ్ పరశురాం స్థానిక స్కూల్ విద్యా కమిటీ చైర్మన్ కాళ్ళ రాజు స్థానిక సింగనబంధ గ్రామ నాయకులు కాళ్ళ చిన్న రాము కాళ్ళ సూరప్పుడు కాళ్ళ గోవిందు కాళ్ళ వరలక్ష్మి తాలాడ అప్పలనారాయణ తదితర నాయకులు పాల్గొన్నారు.

# విత్తన బంతుల పంపిణీ ప్రక్రియ ప్రారంభం



గాజువాక (విజయభాను న్యూస్): ఏపిఎస్ఆర్టిసి సహకారంతో దూర ప్రాంతాలకు వృక్ష సంపదను పెంపొందించడంలో ప్రతీ వ్యక్తి సహకారం అవసరమని హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ విశాఖ్ రిఫైనరీ సిజిఎం(హెచ్ఆర్) కె.నగేష్ అన్నారు. హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో చేపట్టిన విత్తన బంతుల పంనిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించింది. గురువారం ఉదయం మద్దిలపాలెం ఆర్టిసి డిపోలో 70 వేల విత్తన బంతులకు దూర ప్రాంతాలకు వెళ్లే ఆర్టిసి డ్రైవర్లు, కండక్టర్లకు అందజేసారు. ప్రాంతాలకు వెళ్లే బస్ డ్రైవర్లు, కండక్టర్లు వీటిని రహదారికి ఇరువైపులా వెద జల్లాలలని కోరారు. తద్వారా వర్షాలు కురిసిన సమయంలో విత్తన బంతుల నుంచి మెక్కలు రావడానికి అవకాశం కలుగుతుందని, సామాజిక బాధ్యత కలిగిన ఈ కార్యక్రమంలో ఏపిఎస్ ఆర్టీసి భాగస్వామ్యం, సహకారం అందించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అనంతరం స్వచ్ఛపక్షోత్సవాల సందేశాన్ని అందించే హాట్ ఎయిర్ బెలూన్ను విడుదల చేసి, డ్రైవర్లు, కండక్టర్లకు టీషర్ట్ లు, టోపీలు అందజేశారు. బస్సులపై స్వచ్ఛభారత్ స్ఫూర్తిని, సందేశాన్ని అందించే పోస్టర్లను అతికించారు.

జిల్లా ప్రజా రవాణా అధికారి ఏ. అప్పలరాజు మాట్లాడుతూ ఒక్కడిగ్రీ ఉష్ణోగ్రత పెరిగితే ఎన్నో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఉష్ణోగ్రత పెరుగుదలను నియంత్రించడానికి వృక్షాలు దోహదపడతాయని, వీటిని విరివిగా పెంచాలన్నారు. ఇటువంటి పర్యావరణహిత కార్యక్రమంలో తమను భాగస్వాములను చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏపిఎస్ఆర్ఆసి, హెచ్పిసిఎల్ అధికారులు, స్కిల్ డెవలప్మెంట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆర్టిసి డ్రైవర్లు, కండక్టర్లకు సేఫ్టీ కిట్లను అందజేశారు.

## సీబీఎం ప్రాథమిక పాఠశాలలో

# జగనన్న విద్యాకానుకలు పంపిణీ


జగనన్న విద్యాకానుకను పంపిణీ చేస్తున్న 27 వవార్డు కార్పొరేటర్ గొలగాని వీరారావు బుజ్జి

విశాఖపట్నం (విజయ భాను న్యూస్) : 27వ వార్డ్ దొండపర్తి, మండా వారి వీధి నందు యున్న సీబీఎం ప్రాథమిక పాఠశాలలో హెడ్ మాస్టర్ శ్రీనివాసరావు పర్యవేక్షణలో విద్యార్థులకు జగనన్న విద్యా కానుకలు 27వ వార్డ్ కార్పొరేటర్ గొలగాని వీరారావు బుజ్జి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ వీరారావు బుజ్జి మాట్లాడుతూ ప్రభు త్వం అందచేస్తున్న ప్రోత్సవా హకాలతో విద్యార్థి, విద్యార్థినులు విద్యలో ప్రథమశ్రేణిలో రాణించి, ఉన్నత విద్యా శిఖరాలను అధిరోహించాలని ఆయన అన్నారు. ప్రతి విద్యార్థి, విద్యార్థినులు వారిని కన్న తల్లిదండ్రులు కలలు సాకారం చేయాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వార్డ్ టీడీపీ అధ్యక్షుడు అల్లూరి సత్యనారాయణ రెడ్డి, లక్ష్మీ శివప్రసాద్, వెంకన్న, టీ. వీ.రెడ్డి, ఆశిష్, శంకర్ రెడ్డి,నాగేంద్ర రెడ్డి, ఎర్రయ్య, స్కూల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేదలకు పట్టాలు పంపిణీ



అనకాపల్లి (విజయభాను న్యూస్) : పట్టణములో కోట్ని వీధిలో జీవీఎంసీ83.84 వార్డ్ లో సచివాలయంలో పరిధిలో 480 మంది నిరుపేదలకు ఇల్లు పట్టాల పంపిణీ కార్యక్రమం పట్టణ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి కోరుకొండ రాఘవ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. బుధవారం ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా, జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మి, పాల్గొని పట్టాల పంపిణీ చేశారు, ఈ సందర్భంగా వారుమాట్లాడుతూ. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో. రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ సహకారంతో పేద ప్రజలకు ఇల్లు పట్టాలతో పాటు మరిన్ని సంక్షేమ పథకాలు పేద ప్రజలకు ఇవ్వడం జరుగుతుంది ఆమె తెలియజేశారు.రాష్ట్రవ్యాప్తంగా సుమారు 30 లక్ష మంది నిరుపేదలకు ఇల్లు పట్టాలు ఇవ్వడం జరిగిందని ఆమె తెలియజేశారు, మాజీ కౌన్సిలర్ రాజేష్ సతీష్ అధ్యక్షుడు జరిగిన ఈ కార్యక్రమంలో మార్కులు కమిటీ చైర్మన్ పలకా యశోద రవి, పట్టణ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మందపాటి జానకిరామరాజు, కార్పొరేటర్ జాజుల ప్రసన్న లక్ష్మి, రాష్ట్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యువజన భాగం కార్యదర్శి పలకా రవి, పట్టణ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యువ జన అధ్యక్షులు జాజుల రమేష్,వైసిపి నాయకులు. కోరుకొండ అప్పలసూరి, బొండాశంకర్రావు, కారుకుండి కన్నబాబు, కొణ తాల సత్యనారాయణ, జక్కుల కృష్ణ, పిన్నింటి కృష్ణ, మాజీ కౌన్సిలర్ కోట్మి నారాయణమ్మ, గిరిబాబు, కోరుకొండ మునిస్వామి, సచివాలయ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు

# ప్లీనరీ సమావేశానికి తరలివెళ్లిన వైసీపీ నేతలు



అనకాపల్లి (విజయభాను న్యూస్) : వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్లీనరీ సమావేశానికి రాష్ట్ర మంత్రివర్యులుబి శ్రీ గుడివాడ అమర్నాథ్ నేతృత్వంలో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మంత్రివర్యులు కార్యాలయం నుండి బయలు దేరారు. కార్యక్రమానికి మార్కెట్ కమిటీ చైర్పర్సన్ పలకా యశోద పార్టీ జెండా ఊపి ప్రారంభించారు.

ఈ కార్యక్రమం లో రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి పలకారవి,మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు పొలమరశెట్టి మురళీకృష్ణ, సుంకర బాలకృష్ణ, వెంకటేశ్వర స్వామి దేవస్థానం మాజీ ఛైర్మన్ సకలా గోవింద,గౌరీ పి.ఏ.సి.యస్ మాజీ ఛైర్మన్ విల్లూరి శివసూరి, గొల్లవిల్లి నరసింగరావు, కనుబుడ్డి శంకర్, పిళ్ళా నరసింహరాజు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

# విజయభాను సంపాదకీయం

## ప్లాస్టిక్ జీవితం

'హరిత వస్త్రాన్ని ధరించి శోభిల్లుచున్న నా పుడమి తల్లిపై నానా/రూప సహితమై కళావిహీనంగా మార్చుచున్నది/ హిమాద్రి మొదలు కుమారి వరకూ వనమూలికా సహిత/ ఆరోగ్యకారక జలధారలను చాప క్రింద నీరు వలే ప్రవేశించి తన దురాక్రమణతో/ కలుషితం చేయుచున్నది... ప్లాస్టిక్ భూతం' అంటాడో కవి. ప్రపంచవ్యాప్తంగా మానవాళి నిత్యజీవితంలో భాగంగా మారిన ప్లాస్టిక్... పర్యావరణానికి పెను సవాలుగా మారింది. ఒకసారి వాడి పారేసే (సింగిల్ యూజ్) ప్లాస్టిక్ వ్యర్థాలు కొండలా పేరుకు పోతున్నాయి. మనం నిత్యం పడేసే వ్యర్థాల్లో ప్లాస్టిక్ వాటా 10 శాతం. ప్లాస్టిక్ మోజులో పడి మానవాళి నష్టపోతోంది. దేశంలో ప్రతి రోజూ 25 వేల టన్నుల కంటే ఎక్కువగా చెత్త ఉత్పత్తి అవుతోంది. వరల్డ్ ఎకనామిక్ ఫోరం నివేదిక ప్రకారం... భారత్‌లో ఏటా 56 లక్షల టన్నుల చెత్త పోగు పడుతోంది. గత పదేళ్లలో మనం ఉత్పత్తి చేసిన ప్లాస్టిక్ గత శతాబ్దమంతా వాడిన దానికంటే ఎక్కువ. ఇలా వాడి పడేసిన ప్లాస్టిక్ వ్యర్థాలు నాశనం కాకుండా నిల్వ ఉండి, కాలుష్యానికి కారణమౌతున్నాయి.

ప్లాస్టిక్ ఓ అద్భుతమైన రసాయన సమ్మిళిత పదార్థం. దీంతో అనేక వస్తువులు తయారు చేయవచ్చు. ఇవి అందంగాను, రంగురంగులతో వుండి అత్యంత చౌకగా వుండటంతో ప్లాస్టిక్ ప్రపంచ వ్యాప్తంగా బాగా ప్రచారంలోకి వచ్చింది. 'ధనస్వామ్యపు విలువలకు, దారిద్ర్యపు బతుకులకు- నాగుపాములా వెంట పడుతుంది, అధికారం, ధనం గవ్వలకు దాసోహమై, ప్లాస్టిక్ భూతం ప్రేమ పరుగులు తీస్తుంది' అంటూ నేడు ప్రపంచమంతా ప్లాస్టిక్ మాయలో పడిపోయిందని చెబుతాడో కవి. దీని వ్యర్థాల వల్ల మానవాళికి కలిగే ముప్పు అంతా ఇంతా కాదు. బెంగాల్‌కు చెందిన హీరా షేక్ అనే మహిళ గత కొంతకాలంగా కడుపు నొప్పితో బాధపడుతోంది. అది క్రమేపీ పెరుగుతూ తీవ్రం కావడంతో స్థానిక ఆస్పత్రికి వెళ్లింది. డాక్టర్లు ఆ మహిళకు స్కానింగ్ చేయగా, రిపోర్ట్స్‌లో ప్లాస్టిక్ వ్యర్థాలు ఉన్నట్లు గుర్తించారు. అనంతరం ఆమె పొట్టలో నుంచి 100 గ్రాముల ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. ఇదొక తాజా ఉదాహరణ మాత్రమే. సముద్రాల్లోని జలచరాలు ప్లాస్టిక్ తినడం ద్వారా అసంఖ్యాకంగా చనిపోతున్నాయి. పెంపుడు జంతువులను సైతం ప్లాస్టిక్ భూతం వదల్లేదు. ప్రపంచవ్యాప్తంగా 50 శాతం ప్లాస్టిక్ ఉత్పత్తులు ఒకసారి వాడి పారేయదగ్గవే. ఈ తరహా ప్లాస్టిక్ పర్యావరణానికి హాని కారకమవుతోంది. వీటిని నిషేధించకపోతే 2050 నాటికి భూగోళంపై జీవజాతులకు తీవ్ర ముప్పు వాటిల్లుతుందని ఐక్యరాజ్యసమితి అయిదేళ్లుగా హెచ్చరిస్తోంది. ఇప్పటికే కెన్యా ఇలాంటి ప్లాస్టిక్ వస్తువుల నిషేధాన్ని కట్టుదిట్టంగా అమలు చేస్తోంది. థాయ్ లాండ్, రువాండా తదితర దేశాలు అదే బాటన సాగుతున్నాయి. ఈ క్రమంలో ఒక్కసారి వాడి పారేసే ప్లాస్టిక్‌ను జులై 1 నుంచి భారత ప్రభుత్వం నిషేధించింది.

శాసనాలు, ప్రకటనలతో మాత్రమే మార్పు రాదు. వీటిని అమలు చేయాలంటే సవివరమైన, వాస్తవికమైన, ఆచరించదగిన ప్రణాళికలు కావాలి. 2022 కల్లా ప్లాస్టిక్ వాడకాన్ని అంతమొందిస్తామని ప్రధానమంత్రి మోడీ 2018లో ప్రకటించారు. ఈ ప్రకటన నాటకీయమైనదే తప్ప లక్ష్య సాధనకు ఆలోచించి చేసింది కాదని తేటతెల్లం అవుతోంది. ప్రకటనలకే పరిమితం కాకుండా చిత్తశుద్ధితో వ్యవహరించాలి. ముందుగా హానికరమైన ప్లాస్టిక్ ఉత్పత్తులను పరిశ్రమల వద్దే నిలువరించాలి. అలా కాకుండా విచ్చలవిడిగా ప్రజల మీదికి వదిలేసి... మీరు వాడకండని చెప్పటం సమంజసం కాదు. అదే సమయంలో ప్రజలు కూడా ఈ ప్లాస్టిక్ జీవితం నుంచి బయట పడేందుకు పూనిక తీసుకోవాలి. 250 గ్రాములుండే సెల్‌ఫోన్‌ను జేబులో పెట్టుకు మోస్తున్నాం. సుమారు 30 గ్రాముల లోపే వుండే గుడ్డ సంచిని ఎందుకు మోయలేకపోతున్నాం. ఇంటి నుంచే పేపర్ సంచి గాని, గుడ్డ సంచి గాని, జనపనార సంచి గాని తీసుకెళ్లాలి. ప్లాస్టిక్ గ్లాసులకు బదులు స్టీలు, గాజు గ్లాసులు, ప్లాస్టిక్ విస్తర్లకు బదులు ఆకులతో చేసిన విస్తర్లు, ఫ్లెక్సీలకు బదులు గుడ్డతో చేసిన బ్యానర్లను వాడొచ్చు. పాఠశాల నుంచి ప్రధాని వరకు ప్లాస్టిక్ లేని జీవితం కోసం కృషి చేయాలి. అప్పుడే భూగోళాన్ని పర్యావరణ హితంగా మార్చగల్గుతాం. ప్లాస్టిక్ లేని భూమిని తయారు చేసుకుందాం. రేపటి తరాల భవిష్యత్తుకు బాటలు వేద్దాం. ప్లాస్టిక్ సంచులకు 'నో' చెబుదాం.

# జనసేన పార్టీలో భారీ చేరికలు



మాధవధార (విజయభాను న్యూస్): విశాఖ తూర్పు నియజకవర్గం 21 వ వార్డు నుండి అధిక సంఖ్యలో మహిళలు, యువకులు, పురుషులు జనసేనా పార్టీ లో జాయిన్ అయ్యారు. వీర మహిళ జయ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఈ చేరికలు జరిగాయి. 21వార్డ్ ముఖ్య నాయకులు లక్ష్మీనారాయణ వారి అనుచులు తో జనసేనా పార్టీ లో జాయిన్ అయ్యారు. వీరిని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. శివశంకర్ కండువా కప్పి పార్టీ లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ సిద్ధాంతాలు ఆయన ప్రజలకు చేస్తున్న సేవ కార్యక్రమాలు సమస్యలు పై పోరాటాలు ఆకర్షితులై పార్టీలో పెద్ద ఎత్తున ప్రజలు చేరుతున్నారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో జనాసేన పార్టీ కే ప్రజలు పట్టం కట్టడం తధ్యం మని తెలియజేశారు. ఈ ప్రభుత్వం లో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు వారికి బుద్ధి చేప్పే సమయం ఆసన్నమైందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోలిసెట్టి సత్యనారాయణ, కార్యదర్శి గడసాల అప్పారావు, పార్టీ డాక్టర్ సెల్ చైర్మన్ బొడ్డేపల్లి రఘు తదితరులు పాల్గొన్నారు.





**ప్లీనరీ ప్రాంగణంలో ఏర్పాట్లు పర్యవేక్షణలో నిమగ్నమైన విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, నెడ్ క్యాప్ చైర్మన్, ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కేకే రాజు, జీ. వెంకటేశ్వరరావు(జీ.వీ), మహిళా నాయకురాలు పేడాడ రమణి కుమారి, ఆళ్ల శివగణేష్, శైలేష్ తదితరులు.**

# కవి సమయం

## నిశబ్ధం

జీవితం లో కొన్ని అనుభవాలు
భీతిగొల్పుతాయిజి
ఆత్మీయుల మౌనం, మాయమైన అనుబంధాలు
ఒంటరితనం, తన వాళ్ళందరూ దూరం
ప్రేమరాహిత్యం, మనస్సులో నిసబ్దం
మౌనం కూడా మాట్లాడుతుంది కాని
నిశ్శబ్దం నైరాశ్యాన్ని మిగులుస్తుంది
చలన, చర్య రాహిత్యమే నిశబ్ద నిర్వచనం
మౌనాన్ని నిశబ్దంగా మారనీయొద్దు
వేల అర్థాలున్న మౌన శబ్దం నిశ్శబ్దం
వేదనలో ఓడిన క్షణాలు
నిశబ్దంలోకి జారిపోయి
నిర్వేదాన్ని మిగులుస్తాయి
బ్రతుకు నుండి నిశ్శబ్దాన్ని తరిమేయాలి
లేకుంటే అగాధమై అంధకారం మిగులుస్తుంది

సి.ప్రతాప్
ఫ్లాట్ నెంబర్ : 102, శుభ రెసిడెన్సీ
రైల్వే న్యూకోలనీ
విశాఖపట్నం - 530018

# పంచాంగం

మాసం : ఆషాడ; తిథి: నవమి ప.1.11; చిత్ర ఉ.8.08; ప.వ.1.35ల 3.08.

శుక్రవారం 08-07-2022

a **మేషం:** ఉపాధ్యాయులకు, రిప్రజెంటేటివ్‌లకు సదవకాశాలు లభిస్తాయి. స్త్రీలకు తల, మెడ, నడుము, నరాలకు సంబంధించిన చికాకులు ఎదు ర్కొనక తప్పదు. వాతావరణంలో మార్పు వల్ల ఆరోగ్యం మందగిస్తుంది. వృత్తి వ్యాపారు లకు శ్రమాధిక్యత మినహా ఆశించినంత పురోభివృద్ధి ఉండదు.

b **వృషభం :** రాజకీయాల్లో వారి కార్యక్రమాలు వాయిదా పడుట వల్ల ఆందోళనకు గురవుతారు. మీ సరదాలు కోరికలు వాయిదావేసుకోవాల్సివస్తుంది భాగస్వామికుల మధ్య కొత్త విషయాలు చర్చకు వస్తాయి. ప్రముఖుల కలయిక వల్ల ఏమంత ప్రయోజనం ఉండదు. పెద్దల ఆరోగ్యం గురించి ఆందోళన కలిగిస్తుంది.

c **మిథునం :**వ్యాపారాల్లో గణనీయమైన పురోభవృద్ధి సాధిస్తారు. భార్యాభర్తల మధ్య అభిప్రాయ బేధాలు తలెత్తుతాయి. కలప, సిమెంట్, ఇసుక రంగాలలో వారికి లాభదాయకం. ఉద్యోగస్తులు కొత్త బాధ్యతలను సమర్థ వంతంగా నిర్వహిస్తారు. దీర్ఘకాలిక పెట్టుబడులు, కాంట్రాక్టులు అనుకూలిస్తాయి. స్త్రీలకు ఆహార, ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం.

d **కర్కాటకం :** స్థిరాస్తి కొనుగోలు వ్యవహారాలకు అనుకూలం. ఖర్చులు బాగా పెరిగే ఆస్కారం ఉంది. ధన వ్యయంలో ఏకాగ్రత అవసరం. ప్రముఖుల కలయిక సాధ్యము కాదు. ఉద్యోగస్తులు సమర్థవంతంగా పనిచేసి పై అధికారులను మెప్పిస్తారు. ఇసుక కాంట్రాక్టర్లకు అధికారుల నుంచి ప్రతికూలతలు ఎదుర్కొంటారు. మీ ఔన్నత్యాన్ని ఎదుటివారు గుర్తిస్తారు.

e **సింహం :** బ్యాంకు పనుల్లోను, వాహనం నడుపు తున్నప్పుడు ఏకాగ్రత వహించండి. ఒక వ్యవహారం నిమిత్తం ప్లీడర్లతో సంప్రదింపులు జరుపుతారు. ఒక శుభకార్యాన్ని ఘనంగా నిర్వహిస్తారు. స్త్రీల, ఆరోగ్యం క్రమంగా మెరుగు పడుతుంది. ఆదాయ వ్యయాలు సంతృప్తికరంగా ఉంటాయి. ఆత్మీయులను కలుసుకుని మీ బాధలు చెప్పుకోవాలనిపిస్తుంది.

f **కన్య :**కోర్టు వ్యవహారాలు పరిష్కరించబడుతాయి. రాబడికి మించిన ఖర్చులు, చెల్లింపుల వల్ల స్వల్ప ఆటుపోట్లు తప్పవు. క్రయ విక్రయాలు సంతృప్తికరంగా ఉంటాయి. వృత్తుల వారికి మంచి గుర్తింపు, శ్రమకు తగిన ఆదా యం లభిస్తుంది. స్త్రీలకు తమ మాటే నెగ్గా లన్న పంతం అధికంగా ఉంటుంది. బంధువులతో సత్సంబంధాలు నెలకొంటాయి.

g **తుల :** ఏజెంట్లు, బ్రోకర్లకు శ్రమాధిక్యత మిశ్రమ ప్రతిఫలంగా ఉంటుంది. మిమ్ములను చిన్నచూపు చూసిన వారే మీ ఔన్నత్యాన్ని గుర్తిస్తారు. తొందరపాటు నిర్ణయాల వల్ల నష్టపోయే ఆస్కారం ఉంది. నిరుద్యోగుల ఆలోచనలు ఉపాధి పథకాల దిశగా సాగుతాయి. స్త్రీలకు సంపాదన పట్ల ఆసక్తి, చుట్టుపక్కల వారి ప్రోత్సాహం లభిస్తుంది.

h **వృశ్చికం :** స్త్రీలకు ఏ విషయంలోను మనస్థిమితం అంతగా ఉండదు. కుటుంబీకుల మధ్య అనురాగవాత్సల్యాలు పెంపొందుతాయి. నిరుద్యోగులు భేషజాలకు పోకుండా వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడం ఉత్తమం. మీ సంతానం చదువుల కోసం ధనం బాగా వెచ్చిస్తారు. మీరు ఎవరికీ ఎటువంటి హామీలు ఇవ్వడం శ్రేయస్కరం కాదు.


i **ధనుస్సు :** ఉద్యోగస్తులు తోటివారితో విందులు, శుభ కార్యాల్లో పాల్గొంటారు. ఇతరులపై ఆధారపడటం మంచిది కాదని గమనించండి. మీ సంతానం పై చదువులు, ఆరోగ్య విషయాల పట్ల శ్రద్ధ వహిస్తారు. కొంతమంది మీ నుంచి ధనం లేక ఇతర్రతా సహాయం అర్థిస్తారు.

j **మకరం :** వృత్తి, ఉద్యోగ విషయాల్లో అందరితో స్నేహంగా ఉండే ప్రయత్నం చేయండి. భవిష్యత్తుకు ఉపయోగపడే నూతన పరిచయాలు బాగా జరుగుతాయి. ఆకస్మిక ప్రయాణాలు చేస్తారు. కుటుంబ సభ్యుల ఆరోగ్య నిమిత్తం ఖర్చులు పెరుగుతాయి.

k **కుంభం :** ఉద్యోగస్తులకు కొత్తగా వచ్చిన అధికారులతో సత్సంబంధాలు నెల కొంటాయి. ఖర్చులు ఊహించినవి కావడంతో ఇబ్బందులంతగా ఉండవు. ఉపాధ్యాయులు ఒత్తిడి, చికాకులను ఎదుర్కొంటారు.

# అన్వేషకులు

## సంకీర్తన



లోకం శోకమయం అని గుర్తించిన బుద్ధుడు, దాన్ని తొలగించేందుకు మార్గాన్వేషణ సాగించాడు. దుఃఖం చీకటిలాంటిది. దూషించినా, శపించినా, పోట్లాడినా అది పోదు. చిరుదివ్వె వెలిగిస్తేనే అంథకారం తొలగుతుంది. కాంతికి రణాలే లోకాన్ని సంతోషంతో నింపుతాయి.

అన్ని దుఃఖాలకు మూలకారణం కోరికలని బుద్ధుడు కనుగొన్నాడు. చుట్టుముట్టిన కాంక్షల కారుచీకటి తొలగేలా, మానవాళికి దివ్యమైన మార్గం చూపే దివ్వెను వెలిగించాడు. స్వార్థం, అహంకారం ఉన్నచోట శాంతి అనేకాంతి కిరణానికి చోటు వుండదు. లోకానికి దారిచూపిన మహాత్ములందరూ, ముందుగా తమలోని తిమిరంతో సమరం చేసినవారే. బుద్ధుడిలా కఠోరదీక్ష వహించి, మార్గాన్వేషకులుగా మారినవారే. వారు లోకం సుఖసంతోషాల కోసం తమ సుఖాల్ని వదులుకున్నారు. ప్రకృతి ధర్మాల్ని అసాంతం పరిశీలించారు. చావు పుట్టుకల గుట్టు తెలుసుకున్నారు. శ్రీకృష్ణ భగవానుడు 'గీత' ద్వారా అందించిన సందేశం అదే. ఆధునిక యుగంలో స్వామి రామతీర్థ ఇచ్చిన సమాధానం అదే!

రామతీర్థ రుషీకేశ్‌లో ఉన్నప్పటి సంఘటన ఇది. ఒకరోజు ఆయన బంధువు దుఃఖిస్తూ అక్కడికి వెళ్లాడు. ఆయన ప్రశ్నార్థకంగా చూశారు. ఇంకేముంది నాయనా! అంతా అయిపోయింది. మీ గ్రామం మురళీవాలాలో వుండే నీ కుమారుడు చనిపోయాడు' అన్నాడా బంధువు.

స్వామిలో ఎలాంటి చలనం కనిపించలేదు. 'గాలి వీస్తుంటుంది. నీరు ప్రవహిస్తుంటుంది. అవి ఎంత సహజమో, చావు పుట్టుకలు సైతం అంతే. ఈ సహజ పరిణామానికి నువ్వుగాని, నేను గాని విలపించడం ఎందుకు' అని ప్రశ్నించి ఆయన తిరిగి ధ్యానంలోకి వెళ్లిపోయారు. ప్రకృతి పరమ రహస్యాన్ని విజ్ఞాన శాస్త్రవేత్తలా, ఆధ్యాత్మిక తత్వవేత్తా తెలుసుకోగలడని ఆయన నిరూపించారు.

జపాన్, ఇంగ్లాండ్, ఈజిప్ట్, అమెరికా దేశాల్లో పర్యటిస్తూ రామతీర్థ సత్యాన్వేషణ కొనసాగించారు. 'కార్యసిద్ధి కావాలంటే ముందుగా మనసు చైతన్యవంతం కావాలి. నిరంతర నదీ ప్రవాహంలా అది మారాలి' అని ఆయన తేటతెల్లం చేశారు.

సత్యాన్వేషకులకు తరచుగా గురువులు తారసపడతారు. 'అందరికంటే నేనే గొప్ప, ఎవరి నుంచి ఏమీ నేర్చుకోవాల్సిన అవసరం లేదు' అని భావించేవారికి ఎక్కడా గురువు లభించడు. జీవితానుభవాలతో పండిపోయిన వృద్ధుల్లో పలువురు 'తెలుసుకోవాల్సింది చాలా ఉంది' అనే సత్యాన్ని గ్రహిస్తారు.

రవీంద్రనాథ్ ఠాగూర్ బాల్యం నుంచే కవితలు రాసేవారు. ప్రకృతిని మనోహరంగా వర్ణించేవారు. ఓ రోజు ఓ బంధువు 'నీ భాష బాగుంటుంది. నీ కవిత్వం వినడానికి ఇంపుగా వుంటుంది. అందులోని భావాల్ని నువ్వు అనుభవాల్ని బట్టి రాస్తున్నావా, లేక కల్పనలా' అని సూటిగా ప్రశ్నించాడు. అవన్నీ కల్పనలు కావడంతో, ఠాగూర్ సమాధానం ఇవ్వలేదు. ఆ బంధువు ఒక నవ్వు నవ్వి వెళ్లిపోయాడు. ఆ తరువాత ఒకనాటి సాయంత్రం ఠాగూర్ సముద్రతీరానికి షికారుకెళ్లారు. అక్కడ సూర్యుడు సముద్రజలాల్లో తళతళలాడుతూ ప్రతిఫలిస్తున్నాడు.

సముద్రం ఇవతల ఉన్న ఒక గుంటలోని నీటిలోనూ సూర్యకిరణాల కాంతి పడటాన్ని ఆయన చూశారు. 'నా అన్వేషణ ఫలించింది. పరమేశ్వరుడి ప్రతిబింబాన్ని ప్రతిచోటా దర్శించవచ్చు అనే సత్యం గ్రహించాను' అనుకుంటూ తిరిగి ఇంటికి వెళ్లిపోయారు. ఆనాటినుంచి ఠాగూర్ రాసిన కవితల్లో ప్రకృతి వర్ణనతో పాటు దైవతత్వం ప్రతిఫలించడం మొదలైంది.

ఇదే సత్యం భాగవతం వంటి పురాణగాథల్లోనూ కనిపిస్తుంది. మహర్షులు తమ ఆధ్యాత్మిక అనుభవాల్ని, అన్వేషణ ఫలితాల్ని పురాణాల రూపంలో వెల్లడించారు. అనంతర కాలంలో, ఆధునిక మేధావులు మళ్లీ అన్వేషణ సాగించడం ద్వారా అవే సత్యాల్ని తిరిగి ఆవిష్కరించారు!

## అమ్మవారి సన్నిధిలో

### సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షులు డా.చింతకాయల



పరవాడ (విజయభాను న్యూస్) : విజయవాడ ఇంద్రకీలాద్రి కనకదుర్గమ్మ తల్లిని గురువారం అనకాపల్లి సర్పంచ్ ల సంఘం జిల్లా అద్యక్షులు, రాష్ట్ర పంచాయతీ రాజ్ చాంబర్ ఉపాధ్యక్షులు , ముత్యాలమ్మ పాలెం సర్పంచ్ డా.చింతకాయల సుజాత ముత్యాలు కనకదుర్గమ్మన్ని దర్శించుకున్నారు. కనకదుర్గమ్మ చల్లనిదీవెనలు అనకాపల్లి జిల్లా ప్రజలు అందరూ మీద ఉండాలానీ మొక్కలు చెల్లించుకున్నారు. ఈయన వెంటతిక్కవానిపాలెం సర్పంచ్ చేపల మసేను ,మండల కోఆప్షన్ సభ్యులు శ్రీ మైలపల్లి అప్పన్న, దూడ నూకాలు, చినసోమేష్ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి

### బీజేపీ కన్వీనర్ రాజాన సన్యాసినాయుడు



అచ్యుతాపురం (విజయభాను న్యూస్) : కేంద్ర ప్రభుత్వ పథకాలను గ్రామాలలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎలమంచిలి నియోజకవర్గ బిజెపి కన్వీనర్ రాజాన సన్యాసినాయుడు అన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న రాజాన మాట్లాడుతూ గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు.

ఈ సమావేశంలో గొంతిన భక్త సాయిరాం, రాజాన రాజు, అగ్గాల హనుమంతరావు, మేరుగు కాసుబాబు, పల్లి రాజుబాబు, వరుపుల శంకర్, మేరుగు రాజుబాబు తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.


## విశాఖ నగర అభివృద్ధికి పాటుపడండి

### 29వ వార్డ్ పర్యటనలో వార్డు కార్పొరేటర్ ఉరికిటి నారాయణరావు



విశాఖపట్నం (విజయభాను న్యూస్): దక్షిణ నియోజకవర్గం 29వ వార్డ్ పర్యటన లో భాగంగా వార్డ్ కార్పొరేటర్ ఉరికిటి నారాయణ రావు ఆధ్వర్యంలో జోనల్ కమిషనర్ చక్రవర్తి, సచివాలయ సిబ్బంది, వార్డు వాళ్లేంటర్స్,జీవీఎంసీ అధికారులు, మరియు వార్డ్ లో వార్డ్ నాయకులు వార్డ్ కార్యకర్తలు సహా ఇంటింటికి వెళ్లి తడి పొడి చెత్త ను ఇంటింటి కి ఇచ్చిన బిన్ బాక్స్ ల వాడుక మరియూ మన 29వ వార్డ్ లో స్పెషల్ గా సర్వే చేస్తూ మీ ఇంట్లో చెత్త ను మూడు డస్ట్ బీన్ లలో వేరు చేయండి.రోజు పారిశుధ్యం సిబ్బదికి అందించండి. పరిశుభ్రత కు ప్రాధ్యానత ఇవ్వడి.ప్లాస్టిక్ సంచులు వాడవదు అని,జనాల్లో అవగాహన కలిపించారు. ముఖ్యంగా పారిశుధ్యం సమస్యలు ఎక్కడా రాకుండా చూడాలని సంబంధిత అధికారులు కు తెలిపారు. తడి చెత్త నుండి ఎరువును తయారు చేయండి. మీ ఇంట్లో పెంచుతున్న కూరగాయలు, పూలు, మరియు పండ్ల మొక్కలకు ఉపయోగించండి. చెత్త ను వేరు చేద్దాం...విశాఖ నగర అభివృద్ధితో పాటు మన 29వ వార్డ్ అభివృద్ధికి సహకరిద్దాం... అని వార్డ్ కార్పొరేటర్ ఉరికిటి నారాయణ రావు పిలుపునిచ్చారు.

## పరశురామావతారంలో జగన్నాథస్వామి



భీమునిపట్నం (విజయ భాను న్యూస్) : భీమిలిలో జగన్నాధ స్వామి గురువారం పరశురామావతారం లో భక్తులకు దర్శన మిచ్చారు. అర్చకులు స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆద్యాత్మిక ప్రవచనాలు జరగనున్నట్లు వంశపారంపర్య అర్చకులు రొంపిచెర్ల సింగరాచార్యులు తెలిపారు.

## పరవాడ ఉద్యానశాఖ అధికారిణిగా లావణ్య



పరవాడ (విజయ భాను న్యూస్) : పరవాడ ఉద్యాన శాఖ నూతన అధికారిణిగా ఎ.లావణ్య బాద్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా గురువారం విజయ భాను ప్రతినిధితో మాట్లాడుతూ నర్సిపట్నం డివిజన్లులో సుమారు 7సంవత్సరాలు విధులు నిర్వహించాము అన్నారు. అనంతరము పరవాడ ఉద్యానశాఖ అధికారిణిగా బాద్యతలు స్వీకరించామనీ అన్నారు. ఈమె అనకాపల్లి జిల్లా మునగపాక, పరవాడ, అనకాపల్లి, కశింకోట తథితర మండలాల్లో విధులు నిర్వహిస్తా మనీ అన్నారు. దింట్లో బాగంగా పరవాడ మండలములో ఉద్యానశాఖ అభివృద్దికి కృషి చేస్తాను అని ఈ సందర్భంగా అమె తెలియపరిచారు.

## నేడు విద్యుత్ కి అంతరాయం

భీమునిపట్నం ( విజయభాను న్యూస్) : జోన్ 3 భీమిలి సబ్ స్టేషన్ 33/11 కెవి, భీమిలి టౌన్ రూరల్ 11కెవి భీమిలి టౌన్ ఫీడర్,11కెవి భీమిలి రూరల్ ఫీడర్ నిర్వహణచెట్లు నరికివేత పనులలో భాగంగా భీమిలి కృష్ణా కాలనీ, చిన్న బజార్,బ్యాంకు కాలనీ, మహాలక్ష్మి పురం, రాయిపాలెం, మూలకుద్దు, డెక్కతిపాలెం,రేఖవానిపాలెం,ఎల్లం పట్టు, రాజలింగం పేట తదితర ప్రాంతాల్లో శుక్రవారం అనగా ఈ రోజు 9 నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు జోన్ 3 ఎపిఈపిడిసిఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మహాలక్ష్మి నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

## వివాహితుడు ఆత్మహత్య

భీమునిపట్నం (విజయభాను న్యూస్) : అప్పులబాధ భరించలేక వివాహితుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. అనకాపల్లి జిల్లా,కె.కోటపాడు మండలానికి చెందిన చదువుల సాయిశంకర్(30) తన భార్యతో కలిసి స్థానిక జూనియర్ కళాశాల వెనుక నివాసం ఉంటున్నారు. అయితే సంగివలస ఎన్ ఆర్ఐ ఆసుపత్రిలో లాబ్ టెక్నిషియన్ గా పనిచేస్తున్నారు. కాగా మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతుని భార్య చదువుల వెంకటలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సరియాపల్లి రెవెన్యూ గ్రామం

### సర్వే నంబర్ 15/2 భూమిని గిరిజనుడు వద్దనుంచి

## గిరిజనేతరుడు భూకబ్జా

- బెదిరించి సంతకాలు చేయించుకున్నారంటున్న బాధితుడు కొర్రపోతయ్య
- బలవంతంగా సబ్ రిజిస్టర్ ఆఫీస్ కు తరలింపు
- బాధితుడు మీడియా ముందు కన్నీరు.. మున్నీరు..
- అధికారులు, పాలకులే నాకు న్యాయం చేయాలంటూ బాధితుడు ఆవేదన



రైతు కొర్ర పోతయ్య

అనంతగిరి (విజయభాను న్యూస్) : భీంపోలు పంచాయతీ సరియపల్లి రెవెన్యూ గ్రామం తరమనవలస గ్రామం చెందిన కొర్ర పోతురాజు అనే గిరిజనుడికి చెందిన సర్వే నంబర్ 15/2 భూమిని భూబకాసురుడు అయిన గిరిజనేతర డు భయభ్రాంతులకు గురి చేసి కబ్జా చేసినట్లు స్థానిక పాత్రికేయుల ముందు బాధితుడు కన్నీరు మున్నీరయ్యారు.ఈ యొక్క భూమిని భీంపోలు గ్రామ కాపరస్తుడు వీరమల్ల అప్పలనాయుడు దగ్గర అప్పట్లో మా తాతగారు కొనుగోలు చేసారని అప్పటి నుండి ఇప్పటి వరకు మేము ఇదే భూమీమ్మద సాగుచేస్తూ జీవిస్తున్నామని ఒక్కసారిగా గిరిజనేతరుడు వచ్చి అలాగే వారి అనుచరులతో మా ఇంటి వద్దకు వచ్చి ప్రక్కనే ఉన్న బీటిగరువు గ్రామానికి వెళ్లి వద్దాం చిన్న విషయం మాట్లాడాలి అని తీసుకుని వెళ్లి అక్కడ నుండి వేరే గ్రామం అయినా తుమ్మనువలస జంక్షన్ కు తీసుకొని వెళ్లి అక్కడ నుండి శృంగవరపుకోట సబ్ రిజిస్టర్ ఆఫీస్ కి తీసుకుని వెళ్లి " ఏమి పోతురాజు ఏమిటి నీ సంగతులు ఏమి చేద్దాం" అని భీంపోలు నివాసి గిరిజనేతరుడు గాంఢ్రించి అడగగా బాధితుడు ఒక్కసారిగా తికమకగా ఆలోచన గురయ్యాడు వెంటవెంటనే సబ్ రిజిస్టర్ ఆఫీస్ కి తీసుకువెళ్లి నాతో నా భార్యతో బలవంతపు సంతకాలు చేయించి నా చేతికి కొన్ని కాగితాలు ఇచ్చి నువ్వు బయట ఉండు అని చెప్పి బయటకు వచ్చాక నీకు ఎవరైనా అడిగితే నేను నాలుగు లక్ష రూపాయలు ఇచ్చాను అని చెప్పు అని బెదిరించారు అలాగే బంధువులు కుటుంబీకులు చుట్టు లేకపోవడంతో నేను నా బార్య భయభ్రాంతులకు గురి చేసి మా సంతకాలు చేయించారని స్థానిక విలేకరుల ముందు వాపోయారు. నేను నా బార్య నిరక్షరాస్యులై కావడంతో నా ఆస్తిని దోచుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు తక్షణమే ప్రభుత్వ అధి కారులు పాలకులు న్యాయం చేయాలని బాధితుడు కోరారు.



దౌర్జన్యంగా భూమిని కబ్జా చేసిన గిరిజనేతరుడు

## నేడు రైతు దగా దినోత్సవం కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

### నాయకులు, కార్యకర్తలకు మాజీ మంత్రి బండారు పిలుపు



పరవాడ (విజయభాను న్యూస్) : నేడు రైతు దగా దినోత్సవం కార్యక్రమాన్ని అనకాపల్లి పార్లమెంటరీ నియోజకవర్గం పార్టీ ఆఫీస్ నుంచి నాలుగు రోడ్ల జంక్షన్ వరకు నిరసన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది అని మాజీ మంత్రివర్యులు బండారు సత్యనారాయణ మూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలియపరిచారు. ఈ కార్య క్రమానికి తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు నేడు ఉదయం 9 గంటలకు అనకాపల్లి పార్లమెంటరీ నియోజకవర్గం పార్టీ ఆఫీస్ దగ్గరకు విచ్చేసి రైతు దగా దినోత్సవం నిరసన కార్యక్రమం అందరూ పెద్ద ఎత్తున వచ్చి విజయవంతం చేయాలాని ఈ సందర్భంగా మాజీ మంత్రివర్యులు బండారు కోరారు.

## పరవాడలో ఇంటింటికి కరపత్రాలు పంపిణీ



పరవాడ (విజయభాను న్యూస్) : పరవాడ సబ్ డివిజన్ పరవాడ గ్రామంలో గురువారం రామాలయం నుండి ఇంటింటి ధర్మ ప్రచారం ప్రారంభించడం జరిగింది. మండల కన్వీనర్ వానపల్లి అప్పలరాజు గ్రామ కన్వీనర్ చిరుకు అప్పారావు ఇంటింటికి వెళ్లి స్టిక్కర్లు అంటించడం కరపత్రాలు పంపిణీ చేసారు. హిందూ ధర్మం గురించి వివరిస్తూ సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో 12వ విడత ధర్మ ప్రచారం గురించి వ్యాస పౌర్ణమి సందర్భంగా ప్రతి దేవాలయంలో పౌర్ణమి హారతి కార్యక్రమం చేయడం జరగాలి. వారానికి ఒకసారి దేవాలయం కేంద్రానికి భజన ఆత్మీయ ఇబ్బందులు గురించి మాట్లాడటం జరిగింది. హిందూ ధర్మ గొప్పతనం ప్రతి ఇంటికి వివరించారు. ఈ కార్యక్రమంలో వానపల్లి అప్పారావు, పరవాడ లోవరాజు, బొడ్డు గంగరాజు, పరవాడ సబ్ డివిజన్ ధర్మ ప్రచారక వెన్నెల అప్పల నాయుడు అధిక సంఖ్యలో మాతృ మూర్తులు పార్వతి, విజయ గుండమ్మ, తదితరులు పాల్గొన్నారు.

### పల్లంకుర్రు రైస్ మిల్లు పై విజిలెన్స్ అధికారులు దాడి

కాట్రేనికోన (విజయభాను న్యూస్) : కాట్రేనికోన మండలం పల్లంకుర్రులో శ్రీరామ బాయిలర్ మిల్లుపై గురువారం విజిలెన్స్ అధికారులు దాడిచేసారు.ఈమిల్లును లీజుకు తీసుకొని నిర్వహిస్తున్న వారు గత కొన్నాళ్లు గా పి.డి.ఎస్ రైస్ ను పెద్ద ఎత్తున కొనుగోలు చేసి వాటిని పాలీష్ చేసి ఎగుమతి చేస్తున్నట్లుసమాచారం. విజిలెన్స్ డిఎస్పీ ఆద్వర్యంలో దాడిచేయగా భారీగా రేషన్ బియ్యం దొరికాయి.ఎస్పీ వచ్చిన తర్వాత పూర్తి వివరాలు వెల్లడిస్తామని ఆయన తెలిపారు

## ఎంవీఆర్‌కు ఉత్సవ కమిటీ ఆహ్వానం

అనకాపల్లి( విజయభాను న్యూస్): మండలంలో కూండ్రం గ్రామంలో ఈ నెల 12న జరిగే నేరాలమ్మ జాతరకు రావాలని ప్రముఖ వ్యాపార వేత్త ముత్యాల గార్మెంట్స్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ అధినేత ముత్యాల వెంకటేశ్వరరావు, ఆహ్వానించారు. ఉత్సవ కమిటీ పెద్దలు నర్సింహరావుపేటలో ఎంవీఆర్ క్యాంపు కార్యాలయానికి విచ్చేసి ఆయనకు ఆహ్వాన పత్రం అందజేసారు. కొప్పాక గ్రామంలో 19న జరిగే పైడితల్లమ్మ ఉత్సవాలని పురస్కరించుకుని అక్కడి పెద్దలు కూడా, ఆయనను గురువారం కలిసి ఆహ్వాన పత్రిక అందజేసారు. తప్పకుండా వస్తానని తన సహాయ సహకారాలు అందిస్తానని వెంకటేశ్వరరావు హామీ ఇచ్చారు.



# రాష్ట్ర వైకాపా ప్లీనరీ సమావేశానికి పయనమైన విశాఖ పశ్చిమ వైకాపా శ్రేణులు



ములగాడ (విజయభాను న్యూస్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ప్లీనరీ సమావేశాలు ఆంధ్రప్రదేశ్ అంతా దిగ్విజయంగా నిర్వహిస్తున్న తరుణంలో ఇదే ఉత్సాహంతో రాష్ట్రస్థాయి ప్లీనరీ సమావేశాలు గుంటూరులో ఈనెల 8, 9వ తారీఖున జరపాలని అధిష్టానం నిర్ణయిం చడంతో దానికి అనుగుణంగా పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనందబాబు, పశ్చిమ నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు, రాష్ట్ర విద్యా విభాగ మౌలిక సదుపాయాల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మల్ల విజయ్ ప్రసాద్ పిలుపుమేరకు పారిశ్రామిక ప్రాంతం పశ్చిమ నియోజకవర్గం 60 వ వార్డు కార్పొరేటర్ పివి సురేష్ నేతృత్వంలో వార్డు నుంచి ముఖ్య నాయకులు రాష్ట్ర ప్లీనరీ సమావేశానికి బస్సు యాత్రలో గురువారం బస్సు లో పయనమయ్యారు.

ఈ కార్యక్రమానికి నగర వైకాపా ప్రధాన కార్యదర్శి, 60 వ వార్డు శ్రీ గౌరీ సేవా సంఘం గౌరవ అధ్యక్షులు సరగడం పత్ని రావు జెండా ఊపి బస్సు యాత్ర కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం బస్సు యాత్రలో వైసీపీ యువ నాయకులు బిల్డర్ సంతోష్, రాయిపురెడ్డి అనిల్ ,సరగడం రామకృష్ణ ,వాడ్రా సత్తిబాబు గుంట సుందర్రావు ,సిహెచ్ బుజ్జి ఇతర ముఖ్య నాయకులు గుంటూరుకు బయలుదేరి వెళ్లారు.

# అనుభవ వైద్య సంఘాల సమాఖ్య ఆంధ్రప్రదేశ్(ఫెడరేషన్) రాష్ట్ర అధ్యక్ష, అదనపు కార్యదర్శులుగా జి.యస్.ప్రసాద్, మారిశెట్టి సుధాకర్

అనంతపురం (విజయభాను న్యూస్) : అనుభవ వైద్య సంఘాల సమాఖ్య ఆంధ్రప్రదేశ్(ఫెడరేషన్) పోలిట్ బ్యూరో సమావేశం ఆదివారం విజయనగరం జిల్లా లో జరిగింది.ఈ సమావేశంలో అనుభవ వైద్య సంఘాల సమాఖ్య ఆంధ్రప్రదేశ్(ఫెడరేషన్) రాష్ట్ర పోలిట్ బ్యూరో సభ్యులు గతంలో ఫెడరేషన్ లో పనిచేసిన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జి.యస్.ప్రసాద్ ను రాష్ట్ర అధ్యక్షుడు గాను,రాష్ట్ర జోనల్ కార్యదర్శి గా పనిచేసిన మారిశెట్టి.సుధాకర్ ను రాష్ట్ర అదనపు కార్యదర్శి గా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన జి.యస్.ప్రసాద్,మారిశెట్టి.సుధాకర్ లు గ్రామీణ వైద్యులను ఉద్దేశించి మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న గ్రామీణ వైద్య సంఘాలను అన్నింటినీ ఒక్క తాటిపైకి తీసుకుని వచ్చి 429 జీవో పునరుద్ధరణ కొరకు కృషి చేస్తామని,అదేవిధంగా డిసెంబరు నెలలో అమరావతి లో గ్రామీణ వైద్యుల మహాసభను నిర్వహిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా



నూతనంగా ఎన్నికైన ప్రసాద్,సుధాకర్ లకు అనంతపురం జిల్లా గ్రామీణ వైద్య సంఘాల నాయకులు, సభ్యులు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

# సినీనటి సాయిపల్లవి పిటిషన్‌ను కొట్టివేసిన తెలంగాణ హైకోర్టు

నోటీసులు రద్దు చేయాలని కోరుతూ ఆమె తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. సాయి పల్లవి అభ్యర్థనను తోసిపుచ్చిన హైకోర్టు ఆమె పిటిషన్‌ను కొట్టివేసింది.

తాను ప్రధాన పాత్ర పోషించిన 'విరాటపర్వం' సినిమా ప్రచారంలో భాగంగా సాయి పల్లవి ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా యాంకర్.. సాయి పల్లవి నేపథ్యం గురించి ప్రశ్నించగా ఆమె స్పందించారు. లెఫ్ట్‌వింగ్, రైట్‌వింగ్ గురించి విన్నానని, తాను మాత్రం న్యూట్రల్‌గా ఉంటానని చెప్పారు. ఈ నేపథ్యంలోనే 'కశ్మీర్ ఫైల్స్' సినిమా గురించి మాట్లాడారు. "90ల్లో కశ్మీర్ పండిట్లను ఎలా చంపారో ఆ చిత్రంలో చూపించారు కదా..! కొవిడ్ సమయంలో ఓ ప్రాంతంలో గోవును వాహనంలో తరలించారు. దాని డ్రైవర్ ఓ ముస్లిం. కొంతమంది అతడిని కొట్టి జై శ్రీరాం, జై శ్రీరాం అంటూ నినాదాలు చేశారు. అప్పుడు జరిగిన దానికి, ఇప్పుడు జరిగిన దానికి తేడా ఏముంది? మనం మంచిగా ఉండాలి. ఎదుటివారిని ఇబ్బంది పెట్టకూడదు" అంటూ సాయిపల్లవి తన అభిప్రాయం వ్యక్తం చేశారు.

# ఆపదలో ఉన్న వారికి అపద్భంధు అంబులెన్స్ వాహనం

## - విశాఖ వ్యాలీ విద్యార్థులు ప్రతిజ్ఞ



ఆరిలోవ (విజయభాను న్యూస్): ఆపదలో ఉన్న వారికి అపద్భంధు అంబులెన్స్ అంటూ విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు.విశాఖ నగరంలో ఉన్న విశాఖ వ్యాలీ స్కూల్ విద్యార్థులు పాఠశాల ఆవరణంలో జేసిఐ విశాఖ ఏక్సలెన్స్ ప్రెసిడెంట్ జె.ఎఫ్.యం హకల్య, సెక్రటరీ జె.ఎఫ్.యం నరేన్ మరియు ట్రైనింగ్ డైరెక్టర్ జె.సి.హెచ్.జీ. ఎఫ్.చంద్రశేఖర్, పాఠశాల ప్రిన్సిపాల్ డా.ఈశ్వరిప్రభాకర్ ఆధ్వర్యంలో విద్యార్థులుచే అంబులెన్స్ కు దారి ఇవ్వడం మన ధర్మం మాత్రమే కాదు మన కర్తవ్యం అంటూ,ఇకపై అంబులెన్స్ సైరన్ విన్న వెంటనే బాధ్యతగా రోడ్ ఎడమ వైపుకు జరిగి అంబులెన్స్ కు దారి ఇస్తామని 3000వేల మంది విద్యార్థులుచే ప్రతిజ్ఞ కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా జె.ఎఫ్.యం. హకల్య మాట్లాడుతూ విద్యార్థులే కాదు ప్రతీ పౌరుడు అంబులెన్స్ కు దారి ఇచ్చి ఆపదలో ఉన్నవారికి ఆదుకోవాలని,ఇటువంటి కార్యక్రమాలకు ప్రతీ ఒక్కరూ సహకరించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు,ఏక్సలెన్స్ సభ్యులు జెసి హిరణ్మయి, జెసి రమ, జెసి రాహుల్, జెసి అశోక్, జెసి సింధు తదితరులు పాల్గొన్నారు.

# హోటల్ లో ప్లాస్టిక్ వినియోగం పై జివిఎంసి కమిషనర్ సీరియస్



రూపాయలు అపరాధం విధించడంతో పాటుగా వెయ్యి గుడ్డ సంచులను స్థానిక ప్రజలకు ఉచితంగా అందిస్తూ నిత్యం హెటల్ లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి గుడ్డ సంచులను అందజేయాలని సూచించారు.


# మంచి అలవాట్లు విద్యార్థి దశ నుండే అలవర్చుకోవాలి

## - జివిఎంసి కమిషనర్ డాక్టర్ జి. లక్ష్మీశ




విశాఖపట్నం, (విజయభాను న్యూస్): విద్యార్థి దశ నుండే మంచి అలవాట్లు అలవర్చుకొని అనుకున్న లక్ష్యాన్ని సాధించాలని జివిఎంసి కమిషనర్ డాక్టర్ జి. లక్ష్మీశ తెలిపారు. గురువారం ఆయన మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియం లోని "ఎసెంట్ (ASCENT) కాలేజ్" ఆధ్వర్యంలో కాలేజి విద్యార్థులకు ప్రతిభ అవార్డుల బహుకరణ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కాలేజ్ లో ఉత్తమ ప్రతిభ కనపరచిన విద్యార్థులకు అవార్డులు, రివార్డులు ఇవ్వడం, విద్యార్థులను ప్రోత్సహించడం వారిలో ప్రతిభను బయటకు తీసుకొని రావడానికి వారిలో పోటీతత్వం ఏర్పడి ఉన్నత స్థానానికి విద్యార్థులను చేర్చుతున్నందుకు కాలేజి యాజమాన్యాన్ని అభినందించారు. విద్యార్థులు చిన్నప్పటి నుండే మంచి అలవాట్లు అలవర్చుకోవాలని, సమాజంలో ఏది మంచో, ఏది చెడ్డో తెలుసుకొని మన లక్ష్యాన్ని సాధించేందుకు మన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, మంచి స్నేహితులు, మంచి వాతావరణం ద్వారా నేర్చుకోవాలని సూచించారు. విద్యార్థులు చెడు వ్యసనాల వైపు వెళ్ళకుండా, మంచి మార్గాన్ని ఎంచుకొని, ఉన్నత స్థాయికి ఎదగాలని, తద్వారా మీ తల్లిదండ్రులకు, విద్యా బోధన నేర్పిన గురువులకు, వారి వారి కాలేజ్ లకు మంచి పేరు తేవాలని సూచించారు. నేడు ప్రపంచ వ్యాప్తంగా ప్లాస్టిక్ వాడకం అధికంగా వుందని, వాటిని నిరోధించడానికి విద్యార్థులందరూ నడుం బిగించాలని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ వలన జరిగే అనర్థాలను ప్రతి ఒక విద్యార్థి మీ ఇంట్లో పాటించి, తల్లి దండ్రులకు అవగాహన కల్పిస్తే కొద్ది రోజులకు నగరంలో పూర్తిగా నిషేధిత ప్లాస్టిక్ ను నిర్మించవచ్చని సూచించారు. అనంతరం కాలేజి యాజమాన్యం ప్రతి విద్యార్థికి క్లాత్ బ్యాగులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎసెంట్ కాలేజ్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఐదుగురు కార్యదర్శులు వీడియో కాన్ఫరెన్స్ కు ఆలస్యంగా హాజరైనందుకు "షో కాజ్ నోటీసులు"



విశాఖపట్నం, (విజయభాను న్యూస్): రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థను నిర్వీర్యపరచ కూడదని సచివాలయ కార్యదర్శులకు జివిఎంసి కమిషనర్ డాక్టర్ జి. లక్ష్మీశ హితవు పలికారు. గురువారం జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని ఆయన ఛాంబర్ నందు ఉన్నతాధికారులతోను, జివిఎంసి పరిధిలోని అన్ని సచివాలయాల కార్యదర్శులతోను వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వం సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు నగరంలో ప్రతి ఒక్కరికి సకాలంలో అందాలని, ప్రతి సంక్షేమ పథకం పేద వాని వద్దకే చేరాలనే మంచి ఉద్దేశ్యంతో సచివాలయ వ్యవస్థను స్థాపించి కార్యదర్శులుగా మిమ్ములను నియమించిందని తెలిపారు. అర్హుడైన పేదవాడు ఎంతో ఆశతో సచివాలయానికి వస్తారని, వారిని చిరునవ్వుతో పలకరించి, వారు పెట్టుకున్న ఆర్జీని పరిశీలించి అర్హత వుంటే వెంటనే వారికి సంక్షేమ పథకాలు అందేలా చూడాలని ఆదేశించారు. ప్రతి కార్యదర్శికి ముఖ్యంగా కోపం, చిరాకు ఉండకూడదని, ప్రజలకు ఓర్పు, సహనం, చిరునవ్వుతో వారి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతి రోజు పరిపాలన కార్యదర్శులు అందరూ సమయానికి ముందే వస్తామని ప్రతిజ్ఞ చేయాలని, ఈ సచివాలయాలలో "సిటిజన్ ఫ్రెండ్లీ" అనే బోర్డు వుండాలని, వచ్చిన ప్రతి ఒక్కరు మీ స్నేహితులు లేదా మీ ఆప్తులులా పలకరించి వారి పనులు నెరవేర్చాలని ఆదేశించారు. సచివాలయ పరిధిలో ప్రతి పనిని అందరు కార్యదర్శులు సమాన బాధ్యత తీసుకొని, పారిశుధ్యం, వ్యర్థాల నిర్వహణ, ప్లాస్టిక్ నిర్మూలన తదితర పనులపై నిఘా ఉంచాలని పై అధికారులకు తెలియజేయాలని సూచించారు. జూన్-5వ తేదీ నుండి నగరంలో ప్లాస్టిక్ నిర్మూలించమని ప్రతి కార్యదర్శి ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 9 గంటల వరకు వంతుల వారిగా వారి సచివాలయ పరిధిలోని మార్కెట్లు, దుకాణాలను, రోడ్డు ప్రక్కన వ్యాపారాలను తనిఖీ చేసి ప్లాస్టిక్ అమ్మకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సచివాలయ పరిధిలో మార్కెట్లు, దుకాణాలు, వీధి విక్రయాలు ఎన్ని వున్నాయో ఒక జాబితా తయారు చేసుకొని వారిని నిత్యం పర్యవేక్షించి వారికి ప్లాస్టిక్ పై అవగాహన కల్పించాలని ఆదేశించారు.

"క్లాప్" (క్లీన్ ఆంధ్రప్రదేశ్) పథకంలో భాగంగా వినియోగ రుసుం వసూలు వేగవంతం చేయాలని, అన్ని గృహ, వాణిజ్య సముదాయాలకు డిమాండ్ లో చేర్చాలన్నారు. సీజనల్ వ్యాధులు ఈ 3 నెలలో ప్రబలె అవకాసం ఉన్నందున కార్యదర్శులు, ఆశా వర్కర్లు, వాలంటీర్లు టీం లుగా ఏర్పడి ప్రతి రోజు ప్రజలకు అవగాహన కల్పించాలని, వాటి నివారణకు చర్యలు తీసుకోవాలని, ప్రతి శుక్రవారం "డ్రై డే" పాటించాలని ఇంటింటికి వెళ్లి తెలపాలన్నారు. వారు తీసుకున్న ప్రతి పనిని My Gov యాప్ లో (ఫ్రై డే డ్రై డే) యాప్ లో తప్పనిసరిగా నమోదు చేయాలని ఆదేశించారు. కార్యదర్శులు పనిలో ఒత్తిడి లోనవకుండా ప్రశాంత వాతావరణంలో విధులు నిర్వహించాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ కు ఆలస్యంగా హాజరైన ఐదుగురు కార్యదర్శులకు "షో కాజ్ నోటీసులు" ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇటువంటి మీటింగులు జరిగినప్పుడు విధులకు హాజరు కాలేని యెడల సంబంధించిన జోనల్ కమిషనర్ కు వినతి పూర్వకంగా తెలియపరచి, అనుమతి తీసుకోవాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో ఎడిసి-2 ఎస్.ఎస్. వర్మ, జె.డి.(అమ్రిత్) విజయ భారతి, అందరు జోనల్ కమిషనర్లు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



# మామిడిపండుతో లాభాలు మెండు






పండ్లల్లో రారాజు మామిడిపండు. ఇది నోటికి రుచికరంగా, కంటికి అందంగా ఉండడమే కాకుండా అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉంది. ఈ పండులో ఉండే న్యూట్రీషియన్లు వ్యాధి నిరోధకతను పెంచడంలో గొప్పగా సహాయపడుతుంది. ఈ పండు తినడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు తెలుసుకుందాం..

భోజనం తర్వాత చాలామంది మామిడి పండ్లు తింటారు. ఈ పండులో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. ఇది జీర్ణవాహికలోని ఆహారాన్ని స్ఫటికాలుగా విచ్ఛిన్నం చేసి త్వరగా జీర్ణం కావడానికి సహాయపడుతుంది. ఇది అజీర్ణం, అరుగుదల సరిగా లేకపోవడం వంటి జీర్ణ సంబంధ సమస్యలను తగ్గిస్తుంది.

మామిడిలో ఐరన్ సమృద్ధిగా లభిస్తుంది. అందువల్ల రక్తహీనత సమస్యతో మామిడిపండ్లను తీసుకోవడం ద్వారా మంచి ఫలితాన్ని పొందవచ్చు. ఇందులో ఉండే కాపర్ ఎర్ర రక్తకణాల వృద్ధికి దోహదపడుతుంది.



మామిడిపండులో శరీరంలోని రోగనిరోధక శక్తిని పెంచే బిటాకెరోటిన్ అనే పదార్థం సమృద్ధిగా ఉంది. ఇది మన శరీరంలోని రోగనిరోధక శక్తిని పెంచి శరీరాన్ని బలోపేతం చేస్తుంది.

మామిడిపండ్లలో ఎసిడిటిని తగ్గించే లక్షణాలు పుష్కలంగా ఉన్నాయి. వీటిలో ఉండే మాలిక్ యాసిడ్, సిట్రిక్ యాసిడ్‌ను కలిగి ఉండటం వల్ల ఇది ఎసిడిక్ లెవల్స్‌ను నియంత్రణలో ఉంచుతుంది.

మామిడిపండ్లు జీర్ణక్రియను మెరుగుపరచడంతో పాటు మెటబాలిక్ రేటును పెంచుతాయి. నడుము చుట్టూ ఉన్న కొవ్వును కరిగిస్తాయి.

మామిడి పండ్లలో ఉండే పొటాషియం, మెగ్నీషియం అధిక రక్తపోటు సమస్యను నివారిస్తాయి. విటమిన్ సి, ఫైబర్, పెక్టిన్ శరీరంలో హాని చేసే కొలస్ట్రాల్‌ని తగ్గిస్తాయి.

ఈ పండులో న్యూట్రీషియన్లు, ఆంటీయాక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి. ప్రొస్టేట్ క్యాన్సర్‌ను నివారించగలిగిన శక్తి సామర్థ్యాలు ఇందులో పుష్కలంగా ఉన్నాయని పరిశోధనలో తేలింది. పురుషుల్లో కనిపించే లుకేమియా, ఇతర రకాల క్యాన్సర్లను ఎదుర్కొనే గుణాలు మామిడిపండ్లలో ఉన్నాయి.

మామిడి పండును తినడం వల్ల నోటిలోని చెడు బ్యాక్టీరియా నశిస్తుంది. దంతాలు శుభ్రపడతాయి. పంటిపై ఎనామిల్ కూడా దఢంగా ఉంటుంది. పంటినొప్పి, చిగుళ్ల నుండి రక్తం కారడం వంటి ఇతర చిగుళ్ల సమస్యలు దూరమవుతాయి.

# ఎండలో బయలుదేరే ముందు పుచ్చకాయ ముక్కలు తిన్నారంటే..





ప్రపంచవ్యాప్తంగా దొరికే పుచ్చకాయలు వేసవితాపాన్ని తీర్చుకోవడానికి బాగా పనికొస్తాయి. ఏ వేళలోనైనా తీసుకోవడానికి అనువుగా ఉంటాయి. పుచ్చకాయలు దాదాపు సంవత్సరమంతా దొరికేవే అయినా, వేసవిలో వీటి వినియోగం చాలా ఎక్కువగా ఉంటుంది. ఎండలో బయలుదేరే ముందు కాసిని పుచ్చకాయ ముక్కలు తిన్నట్లయితే వడదెబ్బ నుంచి రక్షణగా ఉంటుంది.పుచ్చకాయల వల్ల కలిగే ఇతర ప్రయోజనాలు

ఎండ వల్ల కమిలిపోయిన చర్మానికి పుచ్చకాయ గుజ్జు పట్టిస్తే త్వరగా మానుతుంది.

మిగిలిన పండ్ల కంటే పుచ్చకాయల్లో నీటిశాతం చాలా ఎక్కువ కాబట్టి, బరువు తగ్గాలనుకునే వారికి చక్కని ఫలహారంగా పనికొస్తాయి.

పుచ్చకాయల్లో పుష్కలంగా ఉండే బీటాకెరోటిన్లు కంటిచూపు సమస్యలను నివారిస్తాయి.ఇందులోని విటమిన్లు, ఖనిజలవణాలు రోగనిరోధక శక్తిని పెంపొందిస్తాయి.

పుచ్చకాయ ముక్కలను తీసుకున్నా, పుచ్చకాయ రసాన్ని తీసుకున్నా మంచిదే.

# అందం రెట్టింపు చేసే గ్రీన్ టీ





# ఆరోగ్య చిట్కాలు...



వాజిలైన్ లో రెండు చుక్కల విటమిన్ ఈ నూనె ను కలిపిన మిశ్రమం చివర్ల చిట్లిపోయిన వెంట్రుకలకు, ముఖం మీద నల్లటి మచ్చలకు మంచి ముందుగా పనిచేస్తుంది.

- రాగి పాత్రలలో నీటిని కానీ, ఆహారాన్ని కానీ తీసుకోవటం వల్ల కంటి చూపు మెరుగవుతుంది. ఇంకా, ఏజింగ్ లక్షణాలను కూడా దూరం చేస్తుంది.
- నానబెట్టిన వాల్ నట్స్ ను ప్రతి రోజు ఉదయం పూట తీసుకుంటే శరీరబరువు అదుపులో ఉంటుంది, జుట్టు బాగా పెరుగుతుంది, ఇంకా జ్ఞాపక శక్తి మెరుగవుతుంది.

# వడదెబ్బ తగలకుండా కాపాడే ఆహారాలు ఇవి



వేసవిలో చాలా మంది వడదెబ్బ బారిన పడుతుంటారు. వడదెబ్బ తగలకుండా ఉండాలంటే కొన్ని ఆహార పదార్థాలు తీసుకుంటే ఆరోగ్యానికి ఎంతో మంచిది. మరి అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం.

వేసవిలో మీ శరీరాన్ని చల్లగా ఉంచుకునేందుకు గుమ్మడికాయ, దోసకాయ తినాలి. ఇవి మీ శరీరాన్ని చల్లగా ఉంచుతాయి.

సబ్జా గింజలల్లో పీచు, ప్రొటీన్లు ఎక్కువగా ఉండటం వల్ల అవి శరీరంలోని వేడిని తగ్గించి చల్లగా ఉంచుతాయి.

నారింజ, నిమ్మకాయలు, వంటివి తీసుకోవడం వల్ల మీ శరీరంలో ఎలక్ట్రోలైట్స్ స్థాయిలు బాగుంటాయి.

పెరుగులో పోషకాలు పుష్కలంగా ఉండటం వల్ల అది శరీరాన్ని చల్లగా ఉంచి ఆరోగ్యాన్ని కాపాడుతుంది.

వేసవిలో నిమ్మరసం తీసుకోవడం వల్ల అవి శరీరం లోపలి నుండి మీకు తాజాదనాన్ని అందించేందుకు సహాయపడతాయి. శరీరాన్ని కూల్ గా ఉంచుతాయి.

ఇంకా పుచ్చకాయ, కొబ్బరి నీళ్ల వంటివి తీసుకుంటే మీకు అలసట అనేదే తెలీదు. శరీరం చల్లగా ఉంటుంది.

# అధిక రక్తపోటు ఉన్నవారు వీటిని తీసుకోకూడదు...!



అధిక రక్తపోటు గతంలో వృద్ధులలో కనుగొనబడింది. అయితే ఇప్పుడు యూత్ లో కూడా దర్శనమిస్తోంది. అధిక బీపీ సమస్యకు కారణం రెగ్యులర్ డైట్ లేకపోవడం, జీవనశైలిలో తేడాలు. అయితే, చాలా మంది ఈ సమస్యను సీరియస్‌గా తీసుకోరు. అయినప్పటికీ, అధిక రక్తపోటుకు చికిత్స చేయకుండా వదిలేస్తే ప్రాణాంతకం కావచ్చు. అధిక బీపీ ఉన్నవారు ఈ క్రింది పదార్థాలకు దూరంగా ఉండాలి.

ఉప్పులో సోడియం ఎక్కువగా ఉండటం వల్ల అధిక రక్తపోటు రోగులకు ఉప్పు శత్రువుగా చెబుతారు. అధిక రక్తపోటు ఉన్న రోగులలో ఉప్పు తీసుకోవడం తగ్గించాలి. కొందరికి ఆహారం మీద ఉప్పు చల్లడం అలవాటు. అటువంటి పదార్థాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ తీసుకోకూడదు. ఆహారంలో సముద్రపు ఉప్పుకు బదులుగా రాతి ఉప్పును ఉపయోగించడం మంచిది. ప్రాసెస్ చేసిన మాంసాన్ని వాడకూడదు. ఎందుకంటే ఇందులో సోడియం కంటెంట్ కూడా ఎక్కువగా ఉంటుంది. దానిని కాపాడేందుకు ఉప్పు కలుపుతారు. కాబట్టి, ప్రాసెస్ చేసిన మాంసాన్ని తినకూడదు. ఇది కాకుండా సాస్, ఊరగాయ, చీజ్ లేదా బ్రెడ్‌తో మాంసాన్ని తినడం వల్ల సమస్య వేగంగా పెరుగుతుంది. కాబట్టి బీపీ ఎక్కువగా ఉన్నవారు ప్రాసెస్ చేసిన మాంసానికి దూరంగా ఉండాలి. కాఫీలోని కెఫిన్ రక్తపోటును పెంచడానికి పనిచేస్తుంది. అందువల్ల, అధిక రక్తపోటు ఉన్న రోగులకు కాఫీ తాగమని నిపుణులు సలహా ఇవ్వరు. మీకు అధిక రక్తపోటు సమస్య ఉంటే, కాఫీని మానేయడం మంచిది.

# కిడ్నీస్టోన్స్ ను తొలగించండి ఇలా ?




ఇటీవలి కాలంలో కిడ్నీలో రాళ్లు ఎక్కువవుతున్నాయి. ఎక్కువ పని గంటలు, శరీరానికి సరిపడా నీరు అందకపోవడం వల్ల ఈ సమస్య వస్తుంది. కిడ్నీ స్టోన్ యొక్క లక్షణాలు ఏమిటో తెలుసు కుందాం.విపరీతమైన వెన్నునొప్పి, కడుపునొప్పి, మూత్ర విసర్జనలో హెచ్చుతగ్గులు, మూత్రనాళంలో మంట, గులాబీ, ఎరుపు లేదా తెలుపు మూత్రం, మూత్రంలో దుర్వాసన, తరచుగా మూత్రవిసర్జన వంటి లక్షణాలు ఉంటాయి.అదనంగా, ఇన్ఫెక్షన్ తర్వాత వికారం, వాంతులు, చలి మరియు జ్వరం మూత్రపిండాల్లో రాళ్ల ఉనికిని సూచిస్తాయి. కిడ్నీలో రాళ్లను మందులతో తొలగించవచ్చు. అయితే ఈ లక్షణాలు స్వల్పంగా ఉంటే ఇంట్లోనే చికిత్స చేయవచ్చు. ఎలాగో తెలుసుకుందాం.ఆయుర్వేదం- కిడ్నీలో రాళ్లను వదిలించుకోవడానికి ఒక వ్యక్తి క్రమం తప్పకుండా నిమ్మరసం తాగాలని పరిశోధనలు చెబుతున్నాయి. నిమ్మకాయలో సిట్రిక్ యాసిడ్ ఉంటుంది. ఇది కాల్షియం నుండి రాళ్ళు ఏర్పడకుండా శరీరం నిరోధిస్తుంది. సిట్రిక్ యాసిడ్ రాయిని విచ్ఛిన్నం చేస్తుంది మరియు దానిని బయటకు పంపుతుంది.నిమ్మరసం వల్ల శరీరానికి చాలా ప్రయోజనాలు ఉన్నాయి. లెమన్ వాటర్ రెగ్యులర్ గా తీసుకోవడం వల్ల శరీరంలోని బ్యాక్టీరియా నశిస్తుంది. నిమ్మరసంలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది, ఇది రోగనిరోధక శక్తిని బలపరుస్తుంది. ఆయుర్వేద శాస్త్రాలలో తులసికి చాలా ప్రాముఖ్యత ఉంది. తులసి ఆకులలో ఎసిటిక్ యాసిడ్ ఉంటుంది, ఇది మూత్రపిండాల్లో రాళ్లను కరిగించి నొప్పిని తగ్గిస్తుంది. తులసి ఆకులలో శరీరజీర్ణవ్యవస్థను మెరుగుపరచడానికి ఉపయోగించే అనేక పోషకాలు ఉన్నాయి.తులసి ఆకులు శరీరంలో ఎలాంటి వాపునైనా తగ్గిస్తాయి. తులసి ఆకు రసంలో యాంటీఆక్సిడెంట్, యాంటీ బాక్టీరియల్ మరియు యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు ఉన్నాయి, ఇవి శరీరంలో మూత్రపిండాల ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి సహాయపడతాయి. అయితే, అన్ని మూత్రపిండాల్లో రాళ్లు ప్రారంభ దశలో పని చేయవు. వ్యాధి ముదిరిన తర్వాత తప్పకుండా వైద్యుడిని సంప్రదించండి.

రాగిజావను పాలు, బెల్లం, యాలకుల పొడితో కలిపి కాచుకుని తాగే అలవాటు ఉందా.. అయితేవేసవి కాలం రాగానే చాలామంది రాగిజావ తాగుతుంటారు.రాగిజావ నిజంగా ఆరోగ్య ప్రదాయినే. వేసవిలో రోజుకోసారి రాగిజావ తీసుకోవడం వల్ల కడుపులో చల్లగా ఉండటంతోపాటు మరెన్నో లాభాలు ఉన్నాయి.



## బరువు తగ్గాలా..?

# ఈ చిట్కాలు పాటించండి..!



చాలా మంది కొంచెం లావు అయితే చాలు అయ్యో చాలా లావు అయిపోయామని హైరానా పడిపోతుంటారు. శరీరం నాజుగ్గా ఉంచుకోవడం కోసం కొంత మంది ప్రయత్నిస్తే.. మరి కొంతమంది ఆరోగ్యం కోసమంటారు. ఇంకొంత మంది సెక్సీగా కనబడటానికి అంటుంటారు. వయసుకు మించిన బరువు ఉండటం మన ఆరోగ్యానికి హానికరం. ఇందుకోసం తిండి మానేస్తుంటారు. డైటింగ్ చేస్తుంటారు. ఫలితంగా ఆరోగ్యాన్ని చెడగొట్టుకుంటారు. డైటింగ్ చేయకుండా, తిండి మానేయకుండా శరీరం బరువు తగ్గాలంటే ఈ చిట్కాలు పాటించండి.

ఆహారంలో ఉప్పు, చక్కెరను వీలైనంత తక్కువగా వాడేలా చూసుకోవాలి. ఇది శరీరం బరువు కోల్పోయే ప్రక్రియను సులభతరం చేస్తుంది. మార్పులు కూడా త్వరగా కనిపిస్తాయి. ఎక్కువ ఉప్పు తీసుకోవడం వల్ల శరీరంలో నీరు నిలుపుకునే సమస్య ఏర్పడి శరీరంలో వాపు సమస్య వస్తుంది. ధాన్యాల కన్నా చక్కెరలు మన శరీరంలో కొవ్వును ఐదు రెట్లు వేగంగా పెంచుతుందని పరిశోధనలు చెప్తున్నాయి. అందుకని ఉప్పు, చక్కెరలు తగ్గించడం ద్వారా శరీరం బరువును తగ్గించుకోవచ్చు.



నీరు దివ్యౌషధం. ఎంత ఎక్కువగా నీరు తాగితే అంత ఆరోగ్యంగా ఉంటాం. సాధారణంగా డ్రింక్స్ అంటే మనలో చాలా మంది ఎక్కువగా పంచదార కలపిన జ్యూసులు, సోడా, ఎనర్జీ డ్రింక్స్ తాగడంపై ఆధారపడతారు. దాంతో శరీరంలో అదనంగా మరి కొంత కొవ్వు ఏర్పడు తుంది. అలా కాకుండా నీళ్ళను ఎక్కువగా తాగడం అలవాటు చేసుకోవాలి. నీళ్లు తాగడం వల్ల సైడ్ ఎఫెక్ట్సు ఉండవు. రక్తంలోని సోడియం నిల్వలు పల్చబడతాయి. అయితే, ఒకేసారి ఎక్కువగా తాగకుండా.. కొంచెం కొంచం తాగుతూ ఉండాలి.

సరైన ఆహారాన్ని సరైన సమయానికి తినడం కూడా మనకు ఆరోగ్యాన్ని తెచ్చిపెడుతుంది. తినే సమయాన్ని సరిచేయడం ద్వారా ఆ సమయంలో ఆకలిని నియంత్రించగలుగుతాం. తినే సమయాలను నిర్ణయించకపోతే ఏదైనా తినడం అలవాటు అవుతుంది. దీనివల్ల కొవ్వు పెరుగుతుంది. అలాకాకుండా నిత్యం ఒకే సమయానికి తినడం అలవాటు చేసుకోవాలి. ప్లేట్‌లో సమతుల్య ఆహారం ఉండేలా చూడాలి. నిత్యం పండ్లు తినడం చాలా మంచిది. కార్బోహైడ్రేట్లు ఎక్కువగా ఉండే ఆహారాలను తినడం వల్ల ఆకలి వేయకుండా శరీరం బరువు తగ్గించుకోవచ్చు.

ఇక నిద్ర కూడా మన శరీరం బరువును నియంత్రించడంలో ముఖ్యపాత్ర పోషిస్తుంది. నిద్ర లేకపోవడం ఊబకాయానికి దారితీస్తుంది. అలాగే దినచర్యను పాడు చేస్తుంది. నిద్ర లేకపోవడం వల్ల శరీరంలో బరువును నియంత్రించే లెప్టిన్ అనే హార్మోన్ స్థాయి తగ్గుతుంది. ఊబకాయం వేగంగా పెరుగుతుంది. అందుకని ప్రతిరోజూ 6 నుంచి 7 గంటల నిద్ర ఉండేలా చూసుకోవాలి.



శరీరం బరువు తగ్గించుకోవడంలో వ్యాయామానికి పెద్ద పాత్ర ఉన్నది. అందుకని వ్యాయమం చేయడాన్ని మిస్సవ్వద్దు. రన్నింగ్, జాగింగ్, స్కిప్పింగ్ వంటి వ్యాయామాలు.. శరీరం బరువు తగ్గించడంలో కీలకంగా పనిచేస్తాయి. ప్రభావం కూడా చాలా వేగంగా ఉండి ఎక్కువ కాలం ఉంటుంది. దుమ్ము దులపడం, కడగడం, తోట పని చేయడం, నీళ్లు నింపడం వంటి ఇంటి పనులను చేయడం ద్వారా చాలా క్యాలరీలు కరిగించుకోవచ్చు.

# వైకాపా ప్లీనరీకి ఆహ్వానం

- రఘురామకు వింత మానసిక వ్యాధి
- దిగ్గజాలకు పెద్దల సభకు ఆహ్వానం
- ప్రభుత్వ బడుల్లో విప్లవాత్మక మార్పులు
- ట్విట్టర్ వేదికగా ఎంపీ(రాజ్యసభ) విజయసాయిరెడ్డి



విశాఖపట్నం/అమరావతి (విజయభాను న్యూస్): వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు నేడు, రేపు రెండు రోజుల పాటు గుంటూరు నాగార్జున యూనివర్సిటీ సమీపంలో జరిగే పార్టీ రాష్ట్ర స్థాయి ప్లీనరీకి కార్యకర్త నుంచి కీలక నేతల వరకు ప్రతి ఒక్కరికీ ఆహ్వానాలు పంపడం జరిగిందని, పొరపాటున ఎవరికైనా ఆహ్వానం అందకపోయినా ఇదే ఆహ్వానంగా భావించి హాజరు కావాల్సిందిగా మనవి చేస్తున్నామని వైఎస్సార్ సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాజ్యసభ సభ్యులు విజయసాయి రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం సామాజిక మాధ్యమాల వేదికగా పార్టీ కార్యకర్తలకు, నేతలకు ప్లీనరీకి రావాల్సిందిగా ఆహ్వానం పలికారు. అదేవిధంగా పలు అంశాలపై తనదైన ధోరణిలో స్పందించారు.

నర్సాపురం ఎంపీ రఘురామక్రిష్ణంరాజు ఒక రకమైన వింత మానసిక వ్యాధి (సిజోఫ్రేనియా) తో బాధపడుతున్నట్లు తెలుస్తోందని, ఈ వ్యాధిగ్రస్థులు విపరీత ధోరణితో ప్రవర్తిస్తుంటారని ఉన్నది లేనట్టు, లేనిది ఉన్నట్టు ఊహించుకుంటారని ఏద్దేవా చేసారు. కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకం దీన్ని సుమోటో గా స్వీకరించి అతనికి పూర్తిగా నయమయ్యేంతవరకు షాక్ ట్రీట్ మెంట్ ఇప్పించాలని కోరుకుంటున్నానని అన్నారు. దక్షిణాది రాష్ట్రాల నుంచి ప్రఖ్యాత అథ్లెట్ పీటీ ఉష, మ్యూజిక్ మ్యాస్ట్రో ఇళయరాజా, ప్రముఖ సంఘసేవకుడు వీరేంద్ర హెగ్డే, సినీ రచయిత విజయేంద్ర ప్రసాద్ లకు రాజ్యసభకు ఎంపిక చేయడం సంతోషంగా ఉందని వారికి మనస్ఫూర్తిగా ఆహ్వానం పలుకుతున్నానని అన్నారు. ఈ దిగ్గజాల రాకతో మరింత మెరుగైన చట్టాలు తయారు చేయడానికి అవకాశం ఉంటుందని అన్నారు.

ప్రభుత్వ బడుల్లో సీటు కోసం పోటీపడుతున్న సందర్భాలు కనిపిస్తున్నాయని, ఐఏఎస్ అధికారులు వారి పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించడం కన్నా గొప్ప విషయమేముంటుందని అన్నారు. ప్రభుత్వ బడుల్లో ఇంతగొప్ప మార్పు గతంలో ఎన్నడూ చూడలేదని, ఇప్పటికైనా చంద్రబాబు మరియు పచ్చ బ్యాచ్ బురదజల్లే ప్రయత్నాలు మానుకోవాలని హితవుపలికారు.

# కళింగ కార్పొరేషన్ ఎజెండాను ప్రభుత్వం దృష్టిలో పెడతా

- తెలంగాణలో కళింగ కులస్తులను బీసీ-ఏ లో చేర్చడమే లక్ష్యం
- కార్పొరేషన్ బోర్డు సమావేశంలో చైర్మన్ పేరాడ తిలక్ హామీ



అమరావతి (విజయభాను న్యూస్): విజయవాడ గొల్లపూడి బీసీ సంక్షేమ భవనంలో కళింగ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ పేరాడ తిలక్ ఆధ్వర్యంలో బోర్డు మీటింగ్ ఏర్పాటు చేయటం జరిగింది.ఈ సమావేశంలో కార్పొరేషన్ డైరెక్టర్స్మరియు ఉమాదేవి (ఎండీ), బీసీ కార్పొరేషన్స్ కో ఆర్డినేటర్ ప్రవీణ్ పాల్గొన్నారు. ముందుగా కళింగ సామాజిక వర్గ పెద్దలు స్వర్గీయ బొడ్డేపల్లి రాజగోపాల్ రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుర్పించి కార్యక్రమాన్ని ప్రారంభించటం జరిగింది. అజెండా లో చర్చించిన ముఖ్యాంశాలు 1) తెలంగాణ లో బీసీ -ఏ నుంచి తొలగించబడిన కళింగ కులాన్ని తిరిగి చేర్చమని ఏపీ ప్రభుత్వం ద్వారా ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి నుంచి తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్ కు సిఫారసు చేయమని. 2) రాష్ట్రంలో ఉన్న ప్రముఖ పుణ్య క్షేత్రాలలో (తిరుపతి, శ్రీశైలం, సింహాచలం, అన్నవరం, ద్వారక తిరుమల) మొదలగు పుణ్యక్షేత్రాలలో సత్రాల నిర్మాణం కొరకు స్థలాలు కేటాయించాలని. 3) రాష్ట్రంలో ఉన్న కళింగ కులం యొక్క జనాభా సంఖ్యను గణన చేయమని. 4) శ్రీకాకుళం లో కళింగ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూట్ ఏర్పాటు చేయటానికి అయిదు ఎకరాల స్థలం కేటాయించాలని. 5) ప్రతి జిల్లాలో ఒక కళింగ సామాజిక భవనం మంజూరు చేయవలసిందిగా. 6) విదేశాల్లో చదువుతున్న కళింగ పేద విద్యార్థులకు రుణ సౌకర్యం కల్పించమని. 7) మన కులం లో ఉన్న పేద వాళ్ళకి కార్పొరేషన్ తరుపున సబ్సిడీ లోన్లు మంజూరు చేయమని. 8) తిరుమల తిరుపతి దేవస్థానానికి దర్శనం (వీ ఐ పీ బ్రేక్) చేసే సిఫారసు లేఖలు కార్పొరేషన్ చైర్మన్ ద్వారా మంజూరు అయినట్లు కృషి చేయాలని తీర్మానించారు. కొన్ని టెక్నికల్ ఇబ్బందుల వలన భుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు బీసీ కులాల్లోని కొంతమందికి అందడం లేదని పలువురు ఫిర్యాదులు చేశారని, ఈ సమస్యను అధిగమించేందుకు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయవలసిందిగా సీఎంను కోరతానని తిలక్ అన్నారు.

ఈ కార్యక్రమంలో ఉమాదేవి (ఎండీ), బీసీ కార్పొరేషన్స్ కో ఆర్డినేటర్ ప్రవీణ్ మాట్లాడుతూ పైవన్నీ ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్లి అమలు జరిగినట్టు చూస్తామని హామీ ఇచ్చారని స్టేట్ డైరెక్టర్, కళింగ కార్పొరేషన్.డా. సనపల రవీంద్ర భరత్ ఓ ప్రకటనలో తెలియజేశారు.



# వైయస్ఆర్‌సీపీ రాష్ట్ర స్థాయి ప్లీనరీకి భారీగా తరలిన వెళ్లిన విశాఖ ఉత్తర శ్రేణులు




సీతమ్మధార (విజయభాను న్యూస్): ఈ నెల 8, 9 న గుంటూరు జిల్లా ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎదురుగా వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి ప్లీనరీ సమావేశంనకు విశాఖ ఉత్తర నియోజకవర్గం నుండి విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త,రాష్ట్ర నెడ్ క్యాప్ చైర్మన్ కె.కె రాజు ఆధ్వర్యంలో వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులందరూ భారీగా తరలి వెళ్లారు.పది బస్సులు,ఏనభై ఐదు కార్లుతో సుమారు 950 మంది వరకు తరలి వెళ్లారు.ఈ కార్యక్రమాన్ని గురువారం విశాఖ ఉత్తర నియోజకవర్గం కార్యాలయం వద్ద జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్,ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు,14వ వార్డ్ కార్పొరేటర్ కఠారి అనిల్ కుమార్ రాజు లు కలిసి జెండా ఊపి ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు,వార్డు అధ్యక్షులు,రాష్ట్ర & బీసీ కార్పొరేషన్ చైర్మన్ & డైరెక్టర్లు,అనుబంధ సంఘాల అధ్యక్షులు & సభ్యులు, బూత్ కన్వీనర్లు & సభ్యులు మహిళలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.





వైఎస్సార్సీపీ కేంద్ర కార్యాలయం లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి మరియు రాజ్యసభ సభ్యులు వేణుంబాక విజయసాయిరెడ్డిని, అంధ్రప్రదేశ్ రాష్ట్ర హోం శాఖ మంత్రి తానేటి వనిత, మరియు వైస్సార్సీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ పోతుల సునీతను మర్యాదపూర్వకంగా కలిసిన వైసీపీ మహిళా నాయకురాలు పేడాడ రమణికుమారి.

# నెడ్ క్యాప్ బోర్డ్ సమావేశంలో పాల్గొన్న కె కె రాజు



అమరావతి (విజయభాను న్యూస్): రాష్ట్ర నెడ్ క్యాప్ చైర్మన్ కె కె రాజు ఆధ్వర్యంలో గురువారం తాడేపల్లి నెడ్ క్యాప్ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో నెడ్ క్యాప్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు మరియు అధికారులతో సమావేశం నిర్వహించి పలు అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో నెడ్ క్యాప్ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్. రమణా రెడ్డి , డైరెక్టర్లు,నెడ్ క్యాప్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్సీపీ కేంద్ర కార్యాలయం లో వైస్సార్సీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ పోతుల సునీత అధ్యక్షతన వైఎస్ఆర్సీపీ మహిళా విభాగం సమావేశం జరిగింది.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు,చైర్మన్,రాష్ట్ర కమిటీ సభ్యులు,మహిళలు,ఇతర ప్రజా ప్రతినిధులతో కలిసి పాల్గొన్న వైసీపీ మహిళా నాయకురాలు పేడాడ రమణికుమారి, పీలా ఉమారాణి, తదితరులు

VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of VIJAYABHANU PUBLICATIONS ., Published and Printed at VIJAYABHANU PRESS, D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⋆ Phone : 2564353, Fax : 0891-2569004 ⋆ e-mail: vijayabhanudaily@gmail.com